తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన ప్రతిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
శనివారం
25 ఏప్రిల్ 2026
సంపుటి 03
సంచిక 197
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com

# ఒక్క సెకన్
# నూరేళ్ల ప్రాణ సంకటము



- రోడ్డు భద్రతే జీవ రక్ష!
- రోడ్డు నిబంధనల ఉల్లంఘనతో చిన్నాభిన్నమవుతున్న కుటుంబాలు
- హెల్మెట్, సీటు బెల్టు ధారణ ప్రాణాలకు శ్రీరామరక్ష


డెస్క్, ఏప్రిల్ 24 మనం ప్రయాణించేటప్పుడు పాటించే ఒక్క సెకను క్రమశిక్షణ మన ప్రాణాలను నిలబెడితే, అదే ఒక్క సెకను అజాగ్రత్త జీవితాంతం కోలుకోలేని దెబ్బ తీస్తుంది. ప్రాణం అనేది వెలకట్టలేనిది, అది పోతే తిరిగి రాదు అనే సత్యాన్ని ప్రతి వాహనదారుడు గుర్తించాలి. రోడ్డుపై వెళ్లేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం అంటే కేవలం జరిమానాల నుండి తప్పించుకోవడం కాదు, సురక్షితంగా మన ఇంటికి చేరుకోవడం అని అర్థం చేసుకోవాలి. అతివేగం, అజాగ్రత్తగా వాహనాలు నడపడం వల్ల వేలాది మంది ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ఒక వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురైతే ఆ బాధ కేవలం ఆ వ్యక్తికే పరిమితం కాదు, ఆ ఇంటి యజమానిపై ఆధారపడిన కుటుంబం మొత్తం వీధిన పడే అవకాశం ఉంది.

ప్రభుత్వం రోడ్డు భద్రతపై అనేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. "హెల్మెట్ ధరించండి-ప్రాణాలు కాపాడుకోండి", "మద్యం సేవించి వాహనం నడపకండి" వంటి నినాదాలతో క్షేత్రస్థాయిలో ప్రజలను అప్రమత్తం చేస్తోంది. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఆగే ఆ కొన్ని సెకన్లు మన ఓపికకు పరీక్ష కాదు, మన భద్రతకు గ్యారెంటీ. సిగ్నల్ పడకముందే దూసుకుపోవాలని చూసే ఆ ఒక్క క్షణం తొందరపాటు ప్రాణాల మీదకు తెస్తుంది. రహదారి నిబంధనలు మన స్వేచ్ఛను హరించడానికి కావు, మన ప్రయాణాన్ని సుఖమయం చేయడానికి రూపొందించబడ్డాయి. ప్రతి ఒక్కరూ ఒక బాధ్యత గల పౌరుడిగా నిబంధనలను తూచా తప్పకుండా పాటించినప్పుడే ప్రమాద రహిత సమాజాన్ని చూడగలం. ద్విచక్ర వాహనదారులు విధిగా ఐఎస్ఐ మార్కు ఉన్న హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదం జరిగినప్పుడు తలకు తగిలే గాయాల నుండి 80 శాతం రక్షణ లభిస్తుంది. అదే విధంగా కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించడం వల్ల తీవ్రమైన కుదుపుల నుండి రక్షించబడతారు. చాలా మంది హెల్మెట్ ధరించడాన్ని ఒక భారంగా భావిస్తారు, కానీ అది మన తల మీద ఉండే కవచం లాంటిదని

➢ మిగతా 2వ పేజిలో..

# మూగజీవాల రక్షకులకు నీరాజనం

- పశుసంపద ఆరోగ్యం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక
- పశువైద్యుల అంకితభావం ప్రజారోగ్యంపై చూపే ప్రభావం
- ఆధునిక వైద్య సౌకర్యాలు గ్రామీణ ప్రాంతాలకు చేరాల్సిన ఆవశ్యకత



డెస్క్, ఏప్రిల్ 24 ప్రతి ఏటా ఏప్రిల్ చివరి శనివారాన్ని పురస్కరించుకుని ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. మూగజీవాల ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా, మానవాళి మనుగడలో పశువైద్యులు పోషిస్తున్న కీలక పాత్రను గుర్తించడం ఈ రోజు ప్రధాన ఉద్దేశం. పశువులు, పక్షులు, ఇతర వన్యప్రాణుల సంరక్షణలో నిమగ్నమైన వైద్యుల సేవలు వెలకట్టలేనివి. సమాజంలో జంతువుల పట్ల మానవత్వాన్ని పెంపొందించడం, వాటికి వచ్చే వ్యాధుల పట్ల పశుపోషకులను అప్రమత్తం చేయడం ఈ వేడుకల లక్ష్యం. జంతువుల నుండి మనుషులకు సోకే జూనోటిక్ వ్యాధులను అరికట్టడంలో పశువైద్యులు అగ్రభాగాన ఉండి పోరాడుతున్నారు. ఒక ఆరోగ్యవంతమైన జంతు ప్రదర్శనశాల లేదా పాడి పరిశ్రమ కేవలం ఆర్థిక లాభమే కాకుండా, పర్యావరణ సమతుల్యతకు

➢ మిగతా 2వ పేజిలో..



## పర్యావరణ యోధుడు దుశ్చర్లపై దాడి:
# కేటీఆర్ ఖండన

- ఫ్లోరైడ్ సమస్యపై పోరాడిన నేతకు గాయాలు
- దాడి చేసిన వారిపై కఠిన చర్యల డిమాండ్
- అటవీ ప్రాంతంలో జరిగిన ఘర్షణ

నల్లగొండ, ఏప్రిల్ 24 నల్లగొండ ఫ్లోరైడ్ సమస్యపై దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న పర్యావరణవేత్త దుశ్చర్ల సత్యనారాయణపై

➢ మిగతా 2వ పేజిలో..

# పర్యావరణవేత్త సత్యనారాయణకు ప్రభుత్వ వైద్యం

- ఆరోగ్యంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి
- నిమ్స్ ఆసుపత్రిలో చికిత్సకు ఏర్పాట్లు
- ప్రభుత్వ ఖర్చులతో వైద్యం నిర్ణయం





హైదరాబాద్, ఏప్రిల్ 24 పర్యావరణవేత్త, జలసాధన సమితి జాతీయం అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణ ఆరోగ్యం గురించి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆరా తీశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఓఎస్డీ వేముల శ్రీనివాసులు దుశ్చర్ల సత్యనారాయణతో

➢ మిగతా 2వ పేజిలో..



## మిలియన్ మార్చ్ కేసులో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులకు
# భారీ ఊరట

- హైకోర్టు కీలక తీర్పు -- కేసులన్నీ కొట్టివేత
- ట్యాంక్‌బండ్ ఘటనపై నిందితుల జాబితా నుంచి విముక్తి
- దీర్ఘకాల న్యాయ పోరాటానికి ముగింపు

➢ 2వ పేజిలో..



# భారత్‌పై ట్రంప్ వివాదాస్పద వ్యాఖ్యలు

- తీవ్రంగా ఖండించిన విదేశాంగ శాఖ
- చైనా భారత్‌లు నరకకూపాలని విమర్శలు
- అమెరికా పౌరసత్వంపై ట్రంప్ అభ్యంతరం
- మాట మార్చి స్నేహితుడంటూ పొగడ్తలు
- అనుచిత వ్యాఖ్యలపై భారత్ తీవ్ర ఆగ్రహం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24 అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై మరోసారి తన అక్కసు వెళ్లగక్కారు. భారత్‌ను చైనాను నరకకూపాలుగా అభివర్ణిస్తూ తన సామాజిక మాధ్యమ వేదిక ద్వారా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అమెరికాలో జన్మించిన ప్రతి బిడ్డకు ఆటోమేటిక్ గా పౌరసత్వం లభించడం హాస్యాస్పదమని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల చైనా భారత్ వంటి దేశాల నుండి వలసదారులు తమ కుటుంబాలను అమెరికాకు తీసుకువస్తున్నారని ఆయన ఆరోపించారు. వలసదారుల వల్ల అమెరికా

➢ మిగతా 2వ పేజిలో..

# ఆర్టీసీ సంక్షోభంపై కీలక మలుపు




- చర్చలు తుదిదశకు -- ప్రభుత్వం సానుకూల సంకేతాలు
- భట్టి విక్రమార్క నేతృత్వంలో సచివాలయంలో మారథాన్ చర్చలు
- 32 డిమాండ్లలో 29పై అంగీకారం -- మిగిలిన కీలక అంశాలపై తీవ్ర చర్చ
- శంకర్‌గౌడ్ కుటుంబానికి ఆర్థిక సాయం, ఉద్యోగ హామీతో ప్రభుత్వ నిర్ణయం


హైదరాబాద్, ఏప్రిల్ 24 తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితులకు పరిష్కారం కనుగొనే దిశగా సచివాలయంలో జరిగిన చర్చలు కీలక దశకు చేరుకున్నాయి. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రుల బృందం, ఆర్టీసీ జేఏసీ నేతల మధ్య జరిగిన ఈ సమావేశం సుదీర్ఘంగా కొనసాగింది. ప్రభుత్వ ప్రతినిధులు, కార్మిక సంఘాల నేతలు ఎదురెదురుగా కూర్చుని సమస్యలపై సమగ్రంగా చర్చించడం విశేషంగా మారింది.

ఈ చర్చల్లో ఆర్టీసీ జేఏసీ నేతలు మొత్తం 32 డిమాండ్లను ప్రభుత్వ ముందుంచగా, అందులో 29 డిమాండ్లపై మంత్రుల బృందం సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. మిగిలిన మూడు కీలక అంశాలైన ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మిక సంఘాల గుర్తింపు

➢ మిగతా 2వ పేజిలో..

# నేరగాళ్లతో రాజకీయం కొత్తగా ఉంది

- కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు వ్యాఖ్యలు
- వైసీపీని కిల్లర్ పార్టీగా అభివర్ణన
- సొంత మనుషుల్నే చంపుకుంటున్నారని ఆరోపణ
- కార్యకర్తలే పార్టీకి అసలైన అధినేతలు
- ఐదేళ్ల విధ్వంసాన్ని ప్రజలకు వివరించాలి
- అభివృద్ధి కోసం సుదీర్ఘ అధికారం అవసరం



అమరావతి, ఏప్రిల్ 24 ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ప్రస్తుత పరిస్థితులు కొత్తగా

➢ మిగతా 2వ పేజిలో..

జాతీయ దిన పత్రిక
# తరంగాలు
THARANGALU DAILY NEWS
శనివారం, 25 ఏప్రిల్, 2026


## ఒక్క సెకన్ నూరేళ్ల ప్రాణ సంకటము

➢ మొదటి పేజీ తరువాయి

మరువకూడదు. రాంగ్ రూట్ లో ప్రయాణించడం, డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్ ఫోన్ మాట్లాడటం వంటివి నేరమే కాదు, అవి ఆత్మహత్యతో సమానం. ఒక్క సెకను ఫోన్ కాల్ మన జీవితాన్నే మూగబోయేలా చేయవచ్చు. అందుకే వాహనం నడిపేటప్పుడు ఏకాగ్రత కేవలం రోడ్డుపైనే ఉండాలి.రోడ్డు ప్రమాదాల నివారణకు కేవలం ప్రభుత్వ ప్రయత్నాలు మాత్రమే సరిపోవు, ప్రజల ఆలోచనా విధానంలో మార్పు రావాలి. ముఖ్యంగా యువత బైక్ రేసింగ్లు, ప్రమాదకరమైన విన్యాసాలు చేస్తూ తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలో పడేస్తున్నారు. వేగం ఇచ్చే కిక్కు కంటే మన కుటుంబ సభ్యుల చిరునవ్వు ఎంతో విలువైనదని గ్రహించాలి. గమ్యాన్ని ఆలస్యంగా చేరుకున్నా పర్వాలేదు కానీ, ప్రాణాలతో చేరుకోవడం ముఖ్యం. రోడ్డు భద్రతా మాసోత్సవాలు జరిగినప్పుడు మాత్రమే కాకుండా, ప్రతి రోజూ ట్రాఫిక్ నియమాలను మన జీవనశైలిలో భాగంగా మార్చుకోవాలి. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు కఠినంగా వ్యవహరించాలి.

ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ పూనాలి. వాహనం నడిపేటప్పుడు వేగ పరిమితిని పాటించడం, మలుపుల వద్ద అప్రమత్తంగా ఉండటం, పాదచారులకు దారి ఇవ్వడం వంటివి నాగరికతకు చిహ్నాలు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిఘా కెమెరాలు, స్పీడ్ గన్ల భయం కంటే స్వచ్ఛందంగా నిబంధనలు పాటించే బాధ్యత మనపై ఉంది. మీరు ఇంటి నుండి బయలుదేరినప్పుడు మీ కోసం ఇంట్లో ఎవరో ఎదురుచూస్తున్నారనే విషయాన్ని గుర్తుంచుకోండి. మీ ప్రయాణం సురక్షితంగా సాగాలంటే నిబంధనలే మీ రక్షణ కవచాలు. రోడ్డు భద్రత అనేది ఒక నినాదం కాదు, అది ఒక జీవన వేదం అని చాటిచెబుదాం. ఒక్క సెకను జాగ్రత్త వహించి మీ విలువైన ప్రాణాన్ని, మీ కుటుంబ భవిష్యత్తును కాపాడుకోండి.

## భారత్‌పై ట్రంప్ వివాదాస్పద వ్యాఖ్యలు

తన గుర్తింపును కోల్పోతోందని ఇక్కడ ఇప్పుడు ఆంగ్ల భాష మాట్లాడటం లేదని ఆయన విచారం వ్యక్తం చేశారు. వలసదారుల పౌర హక్కుల కోసం పోరాడే అమెరికన్ పౌర హక్కుల సంఘం వల్ల అమెరికాకు తీరని నష్టం జరుగుతోందని ట్రంప్ ఘాటుగా విమర్శించారు. మాఫియా కుటుంబాల కంటే ఈ సంస్థ వల్ల దేశానికి ఎక్కువ హాని జరుగుతోందని ఆయన ఆరోపించారు. వలసదారుల వల్ల ఆరోగ్య సంరక్షణ వంటి ప్రజా సేవలకు భారం పెరుగుతోందని పన్ను చెల్లింపుదారుల సొమ్ము వృథా అవుతోందని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. చైనా భారత్ వంటి దేశాల నుండి ప్రజలు వచ్చి అమెరికా జాతీయ గుర్తింపును నాశనం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఐరిష్ ఇటాలియన్ వంటి వారు అమెరికాలో కలిసిపోయారని కానీ ప్రస్తుత వలసదారులు అలా లేరని ఆయన అభిప్రాయపడ్డారు.

వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కొద్ది గంటల్లోనే ట్రంప్ తన మాట మార్చారు. భారత్ చాలా గొప్ప దేశమని ఆ దేశ నాయకుడు తనకు మంచి స్నేహితుడని పొగడ్తలు గుప్పించారు. ట్రంప్ వ్యాఖ్యలు వైరల్ కావడంతో నష్ట నివారణ చర్యలు చేపట్టిన అమెరికా ప్రతినిధులు ట్రంప్ భారత్ పట్ల సానుకూలంగా ఉన్నారని వివరణ ఇచ్చారు. ఇరు దేశాల మధ్య ఉన్న స్నేహపూర్వక సంబంధాలను గుర్తు చేస్తూ ప్రకటనలు విడుదల చేశారు. ట్రంప్ తీరుపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. ఆయన ద్వంద్వ వైఖరిని నెటిజన్లు ఎండగడుతున్నారు.

ట్రంప్ వ్యాఖ్యలపై భారత ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆయన చేసిన వ్యాఖ్యలు సమాచారం లేనివి అనుచితమైనవని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. ఇరు దేశాల మధ్య ఉన్న పరస్పర గౌరవానికి వాస్తవ పరిస్థితులకు ఇవి అద్దం పట్టవని ఆయన పేర్కొన్నారు. అమెరికా రాయబార కార్యాలయం ఇచ్చిన వివరణను భారత్ పరిగణనలోకి తీసుకుందని చెప్పారు. గతంలో కూడా భారత్ ఆర్థిక వ్యవస్థను నిర్జీవమైనదిగా ట్రంప్ విమర్శించిన విషయాన్ని ఈ సందర్భంగా పలువురు గుర్తు చేస్తున్నారు. ట్రంప్ వ్యాఖ్యలను ఇరాన్ ప్రతినిధులు కూడా తప్పుబట్టారు. చైనా భారత్ రెండూ ప్రపంచ నాగరికతకు పుట్టినిళ్లని వారు కితాబు ఇచ్చారు. ట్రంప్ వ్యాఖ్యలను పరోక్షంగా ప్రస్తావిస్తూ నాగరికతను నాశనం చేస్తానని బెదిరించే వారే యుద్ధ నేరస్తులని వారు విమర్శించారు. కాగా ప్రధాని మోదీ ఈ విషయంలో మౌనంగా ఉండటంపై ప్రతిపక్షాల నుండి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విదేశాంగ శాఖ ప్రకటన మొక్కుబడిగా ఉందని భారత్ ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం వెనకడుగు వేస్తోందని నెటిజన్లు విమర్శిస్తున్నారు. ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు ఈ వ్యాఖ్యల వల్ల పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఆర్టీసీ సంక్షోభంపై కీలక మలుపు



ఎన్నికలు నిర్వహించడం, పీఆర్సీ మరియు డీఏ అమలు వంటి విషయాలపై ఇంకా చర్చలు కొనసాగుతున్నాయి. ఈ అంశాలపై తుది నిర్ణయం తీసుకునే దిశగా ఇరు పక్షాలు చర్చలు ముమ్మరం చేస్తున్నాయి. చర్చలకు ముందు ఆర్టీసీ జేఏసీ నేతలు సీనియర్ ఐఏఎస్ అధికారులతో కూడిన కమిటీతో సమావేశమై తమ డిమాండ్లను వివరించారు. ఆ తరువాత మంత్రుల బృందంతో సమావేశమై అన్ని అంశాలపై చర్చించారు. మధ్యాహ్నం విరామం అనంతరం కూడా చర్చలు కొనసాగడం ఈ అంశం ప్రాధాన్యతను తెలియజేస్తోంది. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్ మృతి తీవ్ర విషాదకరమని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కార్మికులు ఆత్మహత్యల వంటి నిర్ణయాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. చర్చల ద్వారానే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ప్రభుత్వం ఎల్లప్పుడూ కార్మికుల పక్షాన నిలుస్తుందని తెలిపారు. ఆర్టీసీ రాష్ట్రంలో అతిపెద్ద ప్రజా రంగ సంస్థగా ఉండటంతో దాన్ని బలోపేతం చేయడం అందరి బాధ్యత అని ఆయన అన్నారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల సమస్యలపై చిత్తశుద్ధితో స్పందిస్తోందని స్పష్టం చేశారు. కార్మికులు ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసనలను వ్యక్తం చేయాలని, ఆవేశపూరిత చర్యలకు పాల్పడకూడదని విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీల రెచ్చగొట్టే వ్యాఖ్యలు పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేస్తున్నాయని ఆయన హెచ్చరించారు. శంకర్‌గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి ప్రకటించారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, రూ.10 లక్షల ఆర్థిక సాయం, ఇందిరమ్మ ఇల్లు కల్పిస్తామని తెలిపారు. అంతేకాకుండా ఆర్టీసీ జేఏసీ నేతలు కూడా కార్మికుల నుంచి విరాళాలు సేకరించి కుటుంబానికి అదనపు ఆర్థిక సహాయం అందించనున్నట్లు వెల్లడించారు. ప్రతి ఉద్యోగి నుంచి రూ.200 నుంచి రూ.300 వరకు సేకరించి లక్షల రూపాయల సాయం అందించేలా చర్యలు చేపడుతున్నారు. ఈ సమావేశానికి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వివేక్, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రత్యేక సీఎస్ వికాస్‌రాజ్ తదితరులు హాజరయ్యారు. చర్చలు సానుకూల వాతావరణంలో సాగుతున్న నేపథ్యంలో త్వరలోనే తుది నిర్ణయాలు వెలువడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

ప్రస్తుతం ఆర్టీసీ సమ్మె రాష్ట్రవ్యాప్తంగా ప్రభావం చూపుతున్న నేపథ్యంలో ఈ చర్చలు అత్యంత కీలకంగా మారాయి. ప్రభుత్వం-కార్మిక సంఘాల మధ్య అవగాహన ఏర్పడితే సమ్మెకు ముగింపు పలికే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# మూగజీవాల రక్షకులకు నీరాజనం

➢ మొదటి పేజీ తరువాయి

కూడా చిహ్నంగా నిలుస్తుంది. పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న కోట్లాది మంది రైతులకు పశు వైద్యులు నిజమైన ఆప్తమిత్రులు. పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధి, నలుపు జ్వరం వంటి ప్రాణాంతక వ్యాధుల నుండి మూగజీవాలను కాపాడేందుకు వీరు అహర్నిశలు కృషి చేస్తున్నారు. సరైన సమయంలో టీకాలు వేయించడం, పోషకాహార లోపాలను గుర్తించి తగిన సలహాలు ఇవ్వడం ద్వారా పశుసంపదను వృద్ధి చేస్తున్నారు. పశువుల ఆరోగ్యం బాగున్నప్పుడే పాల ఉత్పత్తి పెరిగి రైతు కుటుంబాల్లో ఆర్థిక వెలుగులు నిండుతాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంలో పశువైద్యశాలలు కేంద్ర బిందువులుగా పనిచేస్తున్నాయి. అత్యవసర సమయాల్లో అర్ధరాత్రి సైతం స్పందించి మూగజీవాల ప్రాణాలు కాపాడే వీరి వృత్తి ధర్మం ఎంతో గొప్పది. కేవలం చికిత్స మాత్రమే కాకుండా, పశుపోషణలో శాస్త్రీయ పద్ధతులను రైతులకు వివరించడం వీరి విధిలో ఒక భాగంగా మారింది.

మానవ ఆరోగ్యానికి పశువైద్యానికి విడదీయలేని సంబంధం ఉంది. మనం తీసుకునే పాలు, మాంసం, గుడ్లు వంటి ఆహార పదార్థాల నాణ్యత పశువుల ఆరోగ్యంపైనే ఆధారపడి ఉంటుంది. పశువులకు ఇచ్చే మందులు లేదా యాంటీబయోటిక్స్ ప్రభావం పరోక్షంగా మనుషులపై పడే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని పశువైద్యులు ఎంతో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఆహార భద్రతను నిర్ధారించడంలో వీరి పర్యవేక్షణ అత్యంత కీలకం. ఒకే ఆరోగ్యం అనే అంతర్జాతీయ నినాదంలో భాగంగా జంతువులు, మనుషులు, పర్యావరణం మూడింటి ఆరోగ్యాన్ని సమన్వయం చేయడంలో వీరు ప్రధాన పాత్రధారులు. అంటువ్యాధులు ప్రబలకుండా సరిహద్దుల వద్ద పశువుల తనిఖీలు చేయడం, క్వారంటైన్ కేంద్రాలను నిర్వహించడం వంటి పనులు దేశ రక్షణలో భాగమే.

వన్యప్రాణుల సంరక్షణలో కూడా పశువైద్యుల సేవలు మరువలేనివి. అంతరించిపోతున్న జాతులను కాపాడటం, గాయపడిన అడవి జంతువులకు చికిత్స అందించడం వంటి సవాలుతో కూడిన పనులను వీరు నిర్వహిస్తున్నారు. అడవుల విస్తీర్ణం తగ్గిపోతున్న తరుణంలో జంతువులు జనావాసాల్లోకి రావడం వల్ల కలిగే ఘర్షణలను నివారించడంలో వీరి వ్యూహాలు తోడ్పడుతున్నాయి. జంతు ప్రదర్శనశాలల్లో ఉండే జీవుల మానసిక శారీరక స్థితిగతులను పర్యవేక్షించడం ఒక ప్రత్యేక నైపుణ్యం. జీవవైవిధ్యాన్ని కాపాడటంలో పశువైద్యుల పరిశోధనలు ఎంతో తోడ్పడుతున్నాయి. వారు చేసే ప్రతి శస్త్రచికిత్స, ప్రతి వ్యాక్సిన్ పరిశోధన ప్రకృతి మనుగడకు ఒక భరోసా ఇస్తుంది. మూగజీవాల భాషను అర్థం చేసుకుని వాటి బాధను నివారించే గొప్ప హృదయం పశువైద్యుల సొంతం.

ప్రస్తుత కాలంలో పట్టణ ప్రాంతాల్లో పెంపుడు జంతువుల సంస్కృతి పెరుగుతోంది. కుక్కలు, పిల్లులు, పక్షులను కుటుంబ సభ్యులుగా భావించే వారి సంఖ్య అధికమైంది. ఈ క్రమంలో పెట్ క్లినిక్‌ల ప్రాధాన్యత పెరిగింది. పెంపుడు జంతువులకు వచ్చే వైరల్ ఇన్ఫెక్షన్ల నుండి రక్షణ కల్పించడం, వాటికి క్రమం తప్పకుండా చెకప్ చేయడం అవసరం. పెంపుడు జంతువుల ద్వారా ఇంటి సభ్యులకు, ముఖ్యంగా చిన్న పిల్లలకు వ్యాధులు సోకకుండా వైద్యులు తగిన జాగ్రత్తలు సూచిస్తున్నారు. జంతువుల పట్ల క్రూరత్వాన్ని నిరసిస్తూ వాటి హక్కుల కోసం పోరాడే స్వచ్ఛంద సంస్థలకు పశువైద్యులు సాంకేతిక సహకారాన్ని అందిస్తున్నారు. జీవహింస లేని సమాజం కోసం వీరు చేసే ప్రయత్నాలు అభినందనీయం. పెంపుడు జంతువుల సంరక్షణ కేవలం ఒక సరదా మాత్రమే కాకుండా ఒక బాధ్యత అని వీరు నిరూపిస్తున్నారు.

పశువైద్య రంగంలో కూడా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. డిజిటల్ ఎక్స్-రేలు, స్కానింగ్ సౌకర్యాలు, టెలి-మెడిసిన్ వంటి సేవలు మూగజీవాలకు అందుతున్నాయి. మారుమూల గ్రామాల్లో ఉన్న రైతులకు కూడా ఫోన్ ద్వారా సలహాలు అందించే వ్యవస్థలు మెరుగుపడ్డాయి. కృత్రిమ మేధస్సు సాయంతో పశువుల ప్రవర్తనను విశ్లేషించి జబ్బులను ముందే గుర్తించే పరిశోధనలు సాగుతున్నాయి. ప్రభుత్వాలు పశు వైద్యశాలలను ఆధునీకరించి అవసరమైన మందులు, పరికరాలను సరఫరా చేయాలి. సంచార పశువైద్యశాలల ద్వారా ఇంటి వద్దకే వైద్య సేవలు అందించడం గొప్ప పరిణామం. ఈ సౌకర్యాలను మరింత విస్తరింపజేయడం ద్వారా పశునష్టాన్ని నివారించి రైతులను ఆదుకోవచ్చు. సాంకేతికత తోడైతే పశువైద్య రంగం మరిన్ని అద్భుతాలు సృష్టిస్తుంది.

విద్యార్థులు పశువైద్య వృత్తిని కెరీర్‌గా ఎంచుకోవడం పెరగాలి. సమాజంలో డాక్టర్లతో సమానమైన గౌరవం వీరికి దక్కాలి. పశువైద్య కళాశాలల్లో మౌలిక సదుపాయాలు పెంచి నాణ్యమైన శిక్షణ అందించాలి. యువ పశువైద్యులు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయడానికి ఉత్సాహంగా ముందుకు రావాలి. వారికి అవసరమైన ప్రోత్సాహకాలు, రక్షణ కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. కేవలం చికిత్సకే పరిమితం కాకుండా వ్యాపారవేత్తలుగా మారి డైరీ ఫామ్స్, పౌల్ట్రీ రంగాల్లో నూతన ఆవిష్కరణలు చేయాలి. పశువైద్య వృత్తి అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాదు, అది ఒక సేవ అని గుర్తించినప్పుడే ఈ రంగానికి సార్థకత లభిస్తుంది. భవిష్యత్తు తరాలకు పశు సంపద ప్రాముఖ్యతను వివరించడంలో వీరు మార్గదర్శకులుగా నిలవాలి. ప్రపంచ పశువైద్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ మూగజీవాల పట్ల కరుణ కలిగి ఉండాలి. మన అవసరాల కోసం ప్రాణత్యాగం చేసే పశువుల ఆరోగ్యాన్ని కాపాడటం మన ధర్మం. పశువైద్యులు చేస్తున్న నిశబ్ద పోరాటాన్ని గుర్తించి వారిని గౌరవించాలి. పర్యావరణ వ్యవస్థలో జంతువుల పాత్రను గౌరవిస్తూ వాటి సంరక్షణకు నడుం బిగించాలి. ప్రభుత్వాలు పశుసంవర్ధక శాఖకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చి పశువైద్యుల సమస్యలను పరిష్కరించాలి. ఆరోగ్యవంతమైన పశువులతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమని చాటిచెబుదాం. ఈ రోజున పశు వైద్యులందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ మూగజీవాల రక్షణలో పాలుపంచుకుందాం. దేశ సౌభాగ్యం పశు సంపదపైనే ఆధారపడి ఉందనే సత్యాన్ని మరువకూడదు.

## మిలియన్ మార్చ్ కేసులో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులకు భారీ ఊరట

హైదరాబాద్, ఏప్రిల్ 24 2011లో జరిగిన మిలియన్ మార్చ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావులకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై జరిగిన ఈ ఘటనకు సంబంధించి నమోదైన కేసులను హైకోర్టు పూర్తిగా కొట్టివేసింది.మిలియన్ మార్చ్ సందర్భంగా ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆ సమయంలో పోలీసులు పలు కేసులు నమోదు చేసి, కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను కూడా నిందితులుగా చేర్చారు. ఈ కేసులు దీర్ఘకాలంగా న్యాయస్థానాల్లో విచారణలో కొనసాగుతున్నాయి.

ఈ నేపథ్యంలో పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టులో కీలక వాదనలు వినిపించారు. సంఘటనలతో తమకు ప్రత్యక్ష సంబంధం లేదని, రాజకీయ కారణాలతోనే కేసుల్లో తమ పేర్లు చేర్చారని వివరించారు. ఆధారాలు లేకుండా కేసులు నమోదు చేయడం అన్యాయమని పేర్కొన్నారు.వాదనలు, పత్రాలను పరిశీలించిన హైకోర్టు న్యాయస్థానం ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని తేల్చింది. దీంతో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులపై నమోదైన కేసులను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది. ఈ నిర్ణయం వారికి గణనీయమైన ఉపశమనాన్ని కలిగించింది. దీంతో సంవత్సరాలుగా కొనసాగుతున్న న్యాయపరమైన వ్యవహారం ముగిసినట్లయింది. ఈ కేసులు రాజకీయంగా కూడా ప్రాధాన్యత సంతరించుకున్న నేపథ్యంలో హైకోర్టు తీర్పు చర్చనీయాంశంగా మారింది.

ఈ తీర్పు తర్వాత బీఆర్ఎస్ వర్గాల్లో సంతృప్తి వ్యక్తమవుతుండగా, రాజకీయంగా కూడా ఈ పరిణామం ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇకపై ఈ కేసుకు సంబంధించిన అన్ని న్యాయపరమైన ప్రక్రియలు ముగిసినట్లుగా భావిస్తున్నారు.

## నేరగాళ్లతో రాజకీయం కొత్తగా ఉంది

ఉన్నాయని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్నో రాజకీయ పోరాటాలు చేశాను కానీ నేరగాళ్లతో పోరాడటం తన జీవితంలో ఇదే మొదటిసారి అని ఆయన పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణా తరగతుల్లో పాల్గొన్న ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రత్యర్థి పార్టీని ఒక హంతక ముఠాగా అభివర్ణిస్తూ వారి ఆలోచనా విధానాన్ని ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు. రాజకీయాల్లో విలువలు కాపాడటం తన బాధ్యత అని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

వైసీపీ అధికారంలో లేకపోయినా వారి అరాచక ధోరణి తగ్గలేదని చంద్రబాబు ఆరోపించారు. ఇటీవల కడపలో జరిగిన దస్తగిరి హత్య ఉదంతాన్ని ఆయన ఉదాహరణగా చూపారు. ప్రభుత్వ భూముల పంపకాల్లో తేడాలు రావడంతో సొంత పార్టీ కార్యకర్తనే ఆ పార్టీ నేతలు హతమార్చారని ఆయన విమర్శించారు. అక్రమ సంపాదన కోసం వారు ఎంతటికైనా తెగిస్తారని తన మేనమామలతో కలిసి దోపిడీకి పాల్పడుతున్నారని మండిపడ్డారు. తమ మనుషులను తామే చంపుకుని ఆ నేరాన్ని ఇతరులపై నెట్టేయడం వారికి అలవాటుగా మారిందని ఆయన ధ్వజమెత్తారు. ఇటువంటి దుశ్చర్యల పట్ల ప్రజలు కూడా వాస్తవాలను గ్రహించాలని ఆయన కోరారు.

గతంలో జరిగిన డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసును ప్రస్తావిస్తూ సాక్షులను కూడా బెదిరిస్తున్నారని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్ల మీదకు వచ్చి ప్రజలను ఇబ్బందులు పెడుతూ ఏదైనా చర్యలు తీసుకుంటే దానిని రాజకీయం అంటారని ఆయన విమర్శించారు. పరామర్శకు వెళ్లి సొంత కార్యకర్తలను కార్ల కింద తొక్కించి చంపే సంస్కృతి ఆ పార్టీదని ఆయన ఘాటుగా విమర్శించారు. తన కారు కింద పడి చనిపోయిన కార్యకర్తను కూడా పరామర్శించని మనస్తత్వం వారిదని ఆయన ఎద్దేవా చేశారు. ఇటువంటి వికృత రాజకీయాలను తన జీవితంలో ఎప్పుడూ చూడలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.గత ఐదేళ్ల కాలంలో జరిగిన విధ్వంసాన్ని ప్రజలకు నిత్యం గుర్తు చేయాలని చంద్రబాబు కార్యకర్తలకు సూచించారు. అదే సమయంలో ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను వాటి అమలులో ఎదురవుతున్న కష్టాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు కార్యకర్తలను కాపాడుకున్నానని వారే తనకు కొండంత అండ అని ఆయన పేర్కొన్నారు.

## పర్యావరణ యోధుడు దుశ్చర్లపై దాడి: కేటీఆర్ ఖండన

జరిగిన దాడిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు తీవ్రంగా ఖండించారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితుడికి మెరుగైన వైద్య సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా మోతె మండలం రాఘవాపురంలో దుశ్చర్ల సత్యనారాయణకు వారసత్వంగా వచ్చిన సుమారు 70 ఎకరాల భూమిలో గత 15 ఏళ్లుగా వేలాది మొక్కలను నాటి అటవీ ప్రాంతంగా అభివృద్ధి చేశారు. ఈ ప్రాంతం పర్యావరణ పరిరక్షణకు ఆదర్శంగా నిలవడంతో పాటు, అనేక మంది విద్యార్థులు, పరిశోధకులు అధ్యయనం చేసే కేంద్రంగా మారింది.అయితే ఇటీవల బయ్యా గంగయ్య, మల్లయ్య అనే వ్యక్తులు ఆ అటవీ ప్రాంతంలో చెట్లు నరికి పశువులను మేపుతున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని అడ్డుకునేందుకు అక్కడికి వెళ్లిన దుశ్చర్ల సత్యనారాయణపై గొర్రెల కాపర్లు కుటుంబ సభ్యులతో కలిసి కర్రలతో దాడి చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో దుశ్చర్ల సత్యనారాయణ తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తనపై దాడి చేసిన గంగయ్య, మల్లయ్యతో పాటు రోషాలు, సుమలత, యశ్వంత్, అనూషలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను త్వరగా అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న వ్యక్తిపై దాడి జరగడం ఆందోళనకరమని పర్యావరణవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

## పర్యావరణవేత్త సత్యనారాయణకు ప్రభుత్వ వైద్యం

నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అవసరమైన వైద్య సేవలను తక్షణమే అందించాలని సూచనలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో దుశ్చర్ల సత్యనారాయణకు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేశారు. అన్ని ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని అధికారులు వెల్లడించారు. ఆరోగ్య సేవలు అందించడంలో ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రముఖుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని తెలిపారు.దుశ్చర్ల సత్యనారాయణ వంటి సామాజిక సేవకులు సమాజానికి చేసిన సేవలను గుర్తిస్తూ వారికి అవసరమైన సహాయం అందించడం ప్రభుత్వ బాధ్యతగా పేర్కొన్నారు. ఈ చర్యతో ప్రభుత్వం పట్ల ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. ప్రజా సేవకుల సంక్షేమంపై ప్రభుత్వం కట్టుబడి ఉందనే సందేశం వెళ్లింది.

## బీహార్ రాజకీయాల్లో వేడి

పాట్నా, ఏప్రిల్ 24 బీహార్ రాజకీయాల్లో మళ్లీ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రాష్ట్రంలోని అధికార ఎన్డీయే కూటమి ప్రభుత్వంపై ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ముఖ్యంగా నితీశ్ కుమార్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పించేలా బీజేపీ ఒత్తిడి తీసుకువచ్చిందని ఆయన ఆరోపించారు. రెండు దశాబ్దాల పాటు రాష్ట్రాన్ని నడిపిన నాయకుడిని రాజకీయంగా ముగించారని పేర్కొన్నారు. అసెంబ్లీలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ప్రతిపక్ష నేతగా మాట్లాడిన తేజస్వీ యాదవ్, కొత్తగా బాధ్యతలు చేపట్టిన సీఎం సామ్రాట్ చౌదరికి అభినందనలు తెలిపారు. అయితే అదే సమయంలో ఆయనకు పరోక్షంగా హెచ్చరికలు కూడా జారీ చేశారు. రాజకీయాల్లో జాగ్రత్తగా ముందుకు సాగాలని సూచించారు.ఎన్డీయే మిత్రపక్షమైన జేడీయూ, బీజేపీలపై తేజస్వీ విమర్శలు మరింత తీవ్రమయ్యాయి. నితీశ్ కుమార్ 2030 వరకు ఎన్డీయే నాయకుడిగా కొనసాగుతారని చెప్పిన బీజేపీ ఇప్పుడు మాట మార్చిందని ఆరోపించారు.

THARANGALU DAILY NEWS
శనివారం, 25 ఏప్రిల్, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి.....



**జఫర్గడ్ ప్రతినిధి, ఏప్రిల్ 24,(తరంగాలు)** మండలంలోని సాగరం గ్రామ మాజీ సర్పంచ్ వాజీరు రాజేశ్వర్ రావు మరణించగా ఆయన పార్థివా దేహానికి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం హిమ్మత్ నగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త తుమ్మల రాజశేఖర్ మరణించగా ఆయన పార్థివా దేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ కార్యక్రమాలలో అత్యంత చురుకుగా పాల్గొనే రాజశేఖర్ ఆకస్మిక మరణం అత్యంత బాధాకరమని తెలిపారు. రాజశేఖర్ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చి ఆర్థిక సహాయం అందజేశారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఎమ్మెల్యే వెంట స్థానిక సర్పంచులు మమత చైతన్ కుల్ల మోహన్ రావు,మాజీ మార్కెట్ చైర్మన్ గుజ్జరి రాజు, మాజీ పాక్స్ చైర్మన్ కరుణాకర్ రావు, మాజీ సర్పంచ్ అశోక్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు .

## ఐకేపి సెంటర్‌ను సందర్శించిన మార్కెట్ డైరెక్టర్ ఇల్లందుల బాబు



**జఫర్గడ్ ప్రతినిధి, ఏప్రిల్, (తరంగాలు):** మండల కేంద్రంలోనీ ఐకేపి కొనుగోలు కేంద్రాని మార్కెట్ డైరెక్టర్ ఇల్లందుల బాబు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాని వినియోగించుకోవాలన్నారు. రైతులు పంటను దళారుల దగ్గరుకు కాకుండా ఐకేపీ సెంటర్ కి తీసుకురావాలని సూచించారు. కాంగ్రెస్ అంటేనే రైతుల పక్షపాతి ప్రభుత్వం అని రైతలకు మద్దత్తు ధర ఇస్తుందన్నారు.అలాగే కొనుగోలు విధానం అక్కడి సౌకర్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు.

## ఎక్కడ సమస్య వస్తే అక్కడ నేనున్నానంటున్నా రాంపూర్ గ్రామ సర్పంచ్



కల్వకుర్తి. ఏప్రిల్ 24 తరంగాలు ప్రతినిధి.
తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామంలో అకాల వనగండ్ల వర్షానికి రాంపూర్ నుండి చంద్రదన వెళ్లే రోడ్డుకు ఇరువైపులా చెట్లు విరిగి రోడ్డుమీద పడి రాకపోకలు బంద్ అయ్యి మరియు కరెంటు తీగల మీద పడి రాంపూర్ గ్రామానికి కరెంటు అంతరాయంకలగడంజరిగింది.ప్రయాణికుల ద్వారా తెలుసుకొని వెంటనే రాంపూర్ గ్రామ సర్పంచ్ నిర్మల శ్రీశైలం యాదవ్ వచ్చి జెసిబి సహాయంతో రోడ్ మీద విరిగిపడ్డ చెట్లను తొలగించి ప్రయాణికులకు ఇబ్బంది కాకుండా చేయడం జరిగింది. మరియు లైన్మెన్ ని పిలిపించి కరెంటు మరమ్మతులు చేయడం జరిగింది.అటు నుంచి వెళ్లే ప్రయాణికులు సర్పంచి గారు చేసే పనిని చూసికృతజ్ఞతలుతెలియజేయడంజరిగింది.ఈకార్యక్రమంలో కరెంటు లైన్ మెన్ శ్రీను, కొమురయ్య యాదవ్, చిల్కం శేఖర్ ముదిరాజ్ రొయ్యల రమేష్ ముదిరాజ్, వనం నరసింహ యాదవ్, పాండు యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ నేతల ధర్నా

- కలెక్టర్‌కు వినతి



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** రైతులు గత కొద్ది రోజులుగా పడుతున్న ఇబ్బందులను, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మంలో రైతు మహా ధర్నా చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మదు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున తరలి వచ్చిన రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నా చేపట్టారు. మొక్కజొన్నలను, వరిని కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ.. జే.సీ శ్రీనివాసరెడ్డికి లికిత పూర్వకంగా వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, కందాల ఉపేందర్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు ఇతర పార్టీ ముఖ్య నాయకులు హాజరై ప్రసంగించారు. ప్రభుత్వ విధానాలను, రైతులు పట్ల వ్యవహరిస్తున్న తీరును తప్పుబట్టారు. ప్రభుత్వంపై విమ్మర్శలు చేశారు.

### భారీ బందోబస్తు మధ్య బిఆర్ఎస్ నేత

# ఏనుగుల రాకేష్ రెడ్డి అరెస్ట్

- ఖానాపూర్ పోలీస్ స్టేషన్ కు తరలించిన పోలీసులు



**తరంగాలు, ఏప్రిల్:24, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి**
నర్సంపేట నియోజకవర్గ పట్టణం ఆర్టీసీ డ్రైవర్ శంకర్ ఆత్మహత్య చేసుకుని మరణించిన విషయం తెలుసుకొని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొనేందుకు శంకర్ స్వగ్రామం ముత్తోజీపేట కు చేరుకున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి, బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి ని పోలీసులు భారీ బందోబస్తు మధ్య అరెస్టు చేసి ఖానాపూర్ పోలీస్ స్టేషన్ కి తరలించడం జరిగింది. రాకేష్ రెడ్డి మాట్లాడుతూ 25 ఏళ్లుగా ఆర్టీసీ డ్రైవర్ గా ఉద్యోగం చేసిన శంకర్ గౌడ్ ను కుటుంబ సభ్యులు, సహచరుల కోరిక మేరకు నర్సంపేట డిపోకు తరలించాలంటే ప్రభుత్వం అనుమతించకపోవడం దారుణం అన్నారు. ప్రజా పాలనలో ప్రజల మనోభావాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే విలువ ఇదేనా అన్నారు. సొంత ఇల్లు కూడా లేని శంకర్ గౌడ్ 25 ఏళ్లుగా నర్సంపేట బస్ డిపో నే తన ఇల్లుగా భావించాడు. అందుకే వారి సహచరులు, కుటుంబ సభ్యులు అక్కడి నుండే అంతిమయాత్ర చేయాలని తపిస్తున్నారు అన్నారు. శంకర్ గౌడ్ ఆత్మ గోషించేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించడం దుర్మార్గం అన్నారు. 20 23 ఆగస్టు 6 న అసెంబ్లీలో బిఆర్ ఎస్ ప్రభుత్వం, కె సి ఆర్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే



బిల్లు పాస్ చేశారన్నారు. సెప్టెంబర్ 14 న గవర్నర్ ఆమోద ముద్ర వేసి సెప్టెంబర్ 15 న విలీనం గెజిట్ సైతం విడుదల చేసిందని సెప్టెంబర్ 29 నా విధి విధానాలు ఖరారు కోసం కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. తర్వాత ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో విలీన ప్రక్రియ ఆగిందని ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విలీనం చేస్తామని హామీలు ఇచ్చి తాచారం చేయడం వల్లనే ఇలా జరుగుతుందన్నారు. తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం విలీన ప్రక్రియకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేయడం జరిగింది. వారి వెంట మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు, సర్పంచ్ దాసరి రమేష్, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రామసహాయం ఉపేందర్ రెడ్డి, మాజీ సొసైటీ డైరెక్టర్ ఆబోతు అశోక్ యాదవ్, ఉప సర్పంచ్ ఉప్పు రాజు, వార్డ్ సభ్యులు అజహార్, జిల్లా సీనియర్ నాయకులు వల్లెపు శ్రీను, వ్యవసాయ మార్కెట్ మాజీ డైరెక్టర్ తేజవాత్ బాలు, మాజీ సర్పంచ్ వల్లెపు సోమయ్య, పురుషోత్తం యాదవ్, చిర్ర సుమన్ లు పాల్గొన్నారు.

## కార్మికుల డిమాండ్లు నెరవేర్చకుంటే ఉద్యమం తప్పదు

- సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హెచ్చరిక




**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :**
ఖమ్మం : ఆర్టీసీ కార్మికులు న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకుంటే మరో ఉద్యమం తప్పదని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం జేఏసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికుడు కోలా శంకర్ గౌడ్ మృతికి నిరసనగా సమ్మెలో మూడవరోజు నోటికి నల్ల రిబ్బన్ కట్టుకుని బస్ డిపో నుండి పాత బస్టాండ్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం మానవహారం చేపట్టి రెండు నిమిషాల పాటు మౌనం పాటించి కోలా శంకర్ గౌడ్ కు నివాళులర్పించారు.. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు మాట్లాడుతూ కార్మికులు ఇప్పటికి ఇప్పుడే అనుకుని సమ్మె నోటీసు ఇవ్వలేదని.. 41 రోజుల క్రితమే సమ్మె నోటీసు ఇచ్చారన్నారు. సమ్మె ప్రారంభించడానికి ముందు కార్మిక సంఘాలతో చర్చలు జరిపిన మంత్రులు మరో నాలుగు వారాలు సమయం కావాలని కోరటం సమంజసం కాదన్నారు. వీరు పెట్టిన డిమాండ్స్ కూడా కొత్తవేమీ కాదనీ గత మూడు సంవత్సరాల నుండి యాజమాన్యం, కార్మికులు, ప్రజల మధ్య నలుగుతున్న డిమాండ్లేన్నారు. ఎన్నికల సమయంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్మికుల సమస్యల పరిష్కరించకుండా దొంగ దారిన బస్సులు నడపాలని చూసినప్పుడు కొంతమంది కార్మికులు నిస్సాయతకు గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల ఎవరు నిరాశ చెందవద్దని పోరాడి సాధించుకోవాలే కానీ ఆత్మహత్యలు పరిష్కారం కాదన్నారు. గతంలో జరిగిన 56 రోజుల పాటు జరిగిన సమ్మెలో సిపిఐ మొదటి రోజు నుండి చివరి వరకు కీలక పాత్ర పోషించిందనీ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఏడు రోజులపాటు ఆమరణ హారదీక్ష చేసి సమస్యకు పరిష్కారం చూపారన్నారు. ఈ సమ్మెలో కూడా సిపిఐ మద్దతు పూర్తిస్థాయిలో ఉంటుందని కార్మికులకు ఆయన భరోసా ఇచ్చారు. . ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గాదే లక్ష్మీనారాయణ తోట రామాంజనేయులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, పగడాల మల్లేష్, పిడిఎస్ యు జిల్లా నాయకులు మస్తాన్ ,జేఏసీ చైర్మన్ పిల్లి రమేష్ కన్వీనర్స్ బిఎస్ రెడ్డి , ఎన్ . నాగయ్య, ఎల్ ఆర్ కే రావు, ఎం ఆర్ నాథ్, పిట్టల సుధాకర్, జేఏసీ నాయకులు బేతంపూడి బుచ్చిబాబు, అనిత, రామలక్ష్మి, సుజాత, , స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు, మాధవరావు , రోశయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఖమ్మం నగరంలోని వైరా రోడ్డులో దారుణం

- వివాహేతర సంబంధం అనుమానంతో కత్తులతో ఒకరిపై ఒకరు దాడి



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :**
కామేపల్లి మండలం, సాతానిగూడెం గ్రామానికి చెందిన భూక్యా ఆనంద్ ఖమ్మం బొమ్మన సెంటర్‌లో సెల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆ షాపులో రియాజ్ అనే వ్యక్తి సెల్ మెకానిక్‌గా వర్క్ చేస్తున్నాడు. రియాజ్ తన భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడని ఆనంద్ కు అనుమానం కలిగింది.
నిన్న రాత్రి సుమారు 10:45 కు నిజాంపేట ఏరియాలోని రియాజ్ ఇంటికి వెళ్లిన ఆనంద్, అక్కడ ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఆనంద్ తన వద్ద ఉన్న కత్తితో రియాజ్ పై దాడిచేశాడు. రియాజ్ తన ఇంట్లో ఉన్న చాకుతో ఆనంద్ పై ఎదురుదాడి చేశాడు. ఇద్దరూ ఒకరిపై ఒకరు కత్తులతో దాడి చేసుకుంటూ నిజాంపేట రోడ్డులోని బిలీఫ్ హాస్పిటల్ మీదుగా ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్ వరకు రియాజ్, ఆనంద్ లు వెళ్ళారు. రియాజ్ ప్రస్తుతం ఖమ్మం లోని ప్రవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడు. ఆనంద్ కు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం ఇద్దరి పరిస్థితి నిలకడగానే ఉన్నది. కేసుకు సంబంధించిన విషయాలు తెలియాల్సి ఉంది.

జాతీయ దిన పత్రిక
# తరంగాలు
THARANGALU DAILY NEWS
శనివారం, 25 ఏప్రిల్, 2026



## ఆరోగ్యవంతులైన పౌరులే దేశానికి అసలైన సంపద

- అడిషనల్ కలెక్టర్ విద్యాచందన



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ ఏప్రిల్ 24**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోషణ పక్వాడ ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సమీకృత కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ విద్యాచందన ముఖ్య అతిథిగా హాజరై, ఆరోగ్యకరమైన ఆహారం ప్రాముఖ్యతను వివరించారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగనవాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారంపై ప్రజల్లో అవగాహన పెంచినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అంగనవాడీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే, అన్నప్రాసన, అక్షరాభ్యాసం వంటి కార్యక్రమాలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన సిబ్బందిని సత్కరించారు. భద్రాద్రి కొత్తగూడెంలో పోషణ పక్వాడ ముగింపు కార్యక్రమం జరిగింది. అడిషనల్ కలెక్టర్ విద్యాచందన పాల్గొని పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. అంగనవాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రతిభావంతులను సన్మానించారు.

## మన జనగణన -మన అభివృద్ధి" పోస్టర్ ఆవిష్కరణ

- కలెక్టర్ అంకిత్ పిలుపు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ ఏప్రిల్ 24**

జిల్లాలో "మన జనగణన – మన అభివృద్ధి" కార్యక్రమానికి సంబంధించి రూపొందించిన అవగాహన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనగణన ద్వారా సేకరించే వివరాలు ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పనకు కీలకమని తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతుల అభివృద్ధికి ఖచ్చితమైన గణాంకాలు అవసరమని చెప్పారు. ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు నిర్వహించనున్న సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో ఉన్న ప్రతి ఉద్యోగి ఈ ప్రక్రియలో పాల్గొనేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి ఉద్యోగి తన కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవడం ద్వారా సమగ్ర గణాంకాల సేకరణకు తోడ్పడాలని కోరారు. జనగణనలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొని ఖచ్చితమైన వివరాలు అందించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఓ సంజీవరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వేసవిలో త్రాగునీరు, ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ ఏప్రిల్ 24**

జిల్లాలో త్రాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు పూర్తి సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, షెడ్లు, తూకం యంత్రాలు వంటి సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అదేవిధంగా, 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించే "సే నో టు డ్రగ్స్" కార్యక్రమాలను గ్రామస్థాయిలో విస్తృతంగా నిర్వహించి యువతలో అవగాహన పెంచాలని ఆదేశించారు. సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నైపుణ్యాభివృద్ధితో యువతకు ఉపాధి

- స్వయం ఉపాధి సాధించాలన్న కలెక్టర్ అంకిత్ పిలుపు



**భద్రాద్రి జిల్లా బ్యూరో తరంగాలు ఏప్రిల్ 24**

పాల్వంచలో నిర్వహించిన నైపుణ్యాభివృద్ధి అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొని శిక్షణార్థులతో మాట్లాడారు. వృత్తి విద్య ద్వారా యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని స్వయం ఉపాధి సాధించాలని సూచించారు. నవ భారత్ వొకేషనల్ ఇనిస్టిట్యూట్ ద్వారా వెల్డింగ్, ఎలక్ట్రికల్, సోలార్ వంటి కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన యువత ఉద్యోగాలు మాత్రమే కాకుండా స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు, చెక్కులు అందజేశారు.

# కేసముద్రంలో అందుబాటులోకి ఆయిల్ ఫామ్ గెలల కొనుగోలు కేంద్రం

- ఆయిల్ పామ్ గెలల సేకరణ సెంటర్ కేంద్రాన్ని ప్రారంభించిన కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత వెంకన్న... వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఐలయ్య

**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, ఏప్రిల్. 24, తరంగాలు:**

కేసముద్రం వ్యవసాయం మార్కెట్ లో ఉద్యాన మరియు పట్టుపరిశ్రమ శాఖ టి. జి. ఆయిల్ ఫెడ్ సహకార శాఖ అధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆయిల్ పామ్ గెలల సేకరణ కేంద్రాన్ని అతిథిగా కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి శ్రీ బానోత్ సునీత వెంకన్న,వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఐలయ్య పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ ఈ కేంద్రం ప్రారంభంతో మన రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

ముఖ్యంగా ఆయిల్ పామ్ పంట పండించే రైతులకు తమ దిగుబడిని సమీపంలోనే సులభంగా విక్రయించే అవకాశం కలుగుతుందన్నారు. ప్రభు త్వం రైతుల అభ్యున్నతికి ఎప్పుడూ కట్టుబడి ఉందనీ ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించడం ద్వారా రైతుల ఆదాయం పెరగడమే లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. మున్సిపాలిటీ తరఫున రైతులకు అవసరమైన సహాయం అందించడానికి మేము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాం అని అన్నారు. ఈ కేంద్రం ఏర్పాటుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, వ్యవసాయ శాఖకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అని అన్నారు. ఈ కార్యక్రమానికి కేసముద్రం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దబోయిన ఐలమల్లు మరియు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మున్సిపల్ కార్పొరేటర్లు డిహెచ్ఎస్ఓ మరియన్న, జిల్లా ఆయిల్ పేడ్ ఇన్చార్జ్ చిలువేరు దయాకర్, కేసముద్రం తాహసిల్దార్ గుండు వివేక్, ఏ ఎం సి సెక్రెటరీ అమర లింగేశ్వరరావు, పి ఎ సి ఎస్ ధనసరి సీఈఓ జి.మల్లారెడ్డి,కేసముద్రం మండల అగ్రికల్చర్ ఆఫీసర్ బి. వెంకన్న, ఉద్యానవన అధికారి శాంతి ప్రియదర్శిని, ఆయిల్ఫీడ్ సిబ్బంది ,ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్నటువంటి అభ్యుదయ రైతులు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.







# అర్హులైన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అక్రిడిటేయేషన్ కార్డుల మంజూరు

- సమాజానికి ఉపయోగపడే వార్తలు అందించి జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలి
- అక్రిడిటేయేషన్ కార్డుల ప్రక్రియ పారదర్శకతతో పూర్తి చేయాలిలి
- జిల్లా కలెక్టర్ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్‌పర్సన్ స్నేహ శబరీష్

మహబూబాబాద్ జిల్లా,ప్రతినిధి, ఏప్రిల్. 24,తరంగాలు:జిల్లాలో 2026-2028 సంవత్సరానికి సంబందిచిన మీడియా అక్రిడిటేయేషన్ కార్డుల జారీ ప్రక్రియను పారదర్శకంగా,నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్‌పర్సన్ స్నేహ శబరీష్, అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ, దరఖాస్తుల సంఖ్య, పరిశీలన విధానం గురించి డీపీఆర్ఓను అడిగి తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత కలిగిన నిజమైన జర్నలిస్టులకే అక్రిడియేషన్ కార్డులు జారీ చేయాలని సూచించారు. వృత్తి ప్రమాణాలు, అనుభవం, సంస్థ గుర్తింపు వంటి అంశాలను ప్రామాణికంగా పరిగణించాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల ద్వారా (447) ఆన్లైన్ దరఖాస్తులు వచ్చాయని, అట్టి దరఖాస్తులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికి కార్డు అందించాలని, ప్రజాస్వామ్యంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని, బాధ్యతాయుతంగా నిజమైన సమాచారాన్ని ప్రజలకు అందించాలన్నారు. అక్రిడియేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, ప్రతి దశలో పారదర్శకత పాటించాలని తెలిపారు. ఈ సమావేశంలో. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, డీపీఆర్ఓ పి. రాజేంద్ర ప్రసాద్, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు సి. హెచ్ శ్రీనివాస్, ఈరగాని బిక్షం, వేముల అయోధ్య రామయ్య, నవాబ్, , షేక్ అక్రం, ఎం.మోహన్ రెడ్డి, గాడిపెల్లి శ్రీహరి, ఉమ్మగాని మధు, ఉప్పల రంగ, సిబ్బంది రాము తదితరులు పాల్గొన్నారు.





## వాసవి మాత జయంతి వేడుకలకు ఘన ఏర్పాట్లు

**ఇల్లందు ప్రతినిధి ఏ 24, ( తరంగాలు ):**

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను ఈనెల 26న (ఆదివారం) ఘనంగా నిర్వహించనున్నట్లు వాసవి క్లబ్ అధ్యక్షుడు, జోన్ చైర్మన్ బోనగిరి రవికిరణ్, కటకం సత్యేంద్ర కుమార్ తెలిపారు. ఇల్లందు పట్టణంలోని జేకే కాలనీ సమీపంలో గల శ్రీ హరి హర క్షేత్రం అయ్యప్ప స్వామి దేవాలయంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమైన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందన్నారు. వాసవి మాత ఉపదేశించిన అహింసా సిద్ధాంతం, సత్యనిష్ఠ జీవన విధానం సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. ఈ జయంతి వేడుకలు ఆర్యవైశ్యుల ఐక్యతను ప్రతిబింబిస్తాయని అభిప్రాయపడ్డారు. ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం పట్టణ పురవీధులలో శోభాయాత్ర నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు, ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



## విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న రాష్ట్ర ప్రభుత్వం

- వెంటనే ఫీజుల బకాయిలు చెల్లించాలి
- టిడిపి మండల అధ్యక్షులు పుట్ట ఉపేందర్ యాదవ్



**ఇల్లందు ప్రతినిధి ఏప్రిల్ 24, ( తరంగాలు):**
విద్యార్థుల ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు అని టిడిపి మండల అధ్యక్షులు పుట్ట ఉపేందర్ యాదవ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన అవినీతితో కూరుక పోతుందని గత ప్రభుత్వనికి,ఈ ప్రభుత్వానికి తేడా లేకుండా ఉందని అన్నారు. భూములు, కాంట్రాక్టు ల పేరు మీద దోచుడు సరిపోక చివరకు విద్యార్థుల స్కాలర్ షిప్ ఫీజులు కూడా దోచుకుంటున్నారని టిడిపి నేతలు ధ్వజమెత్తారు. ఫీజుల బకాయిలు రాకపోవడంతో విద్యార్థులు చదువు మానే పరిస్థితి ఏర్పడిందని, ఎస్సీ/ఎస్టీ / బీసీ విద్యార్థులు చదువుకుంటే ఈ అగ్రకుల పాలకులు ఓర్వలేక పోతున్నారని అన్నారు . ఫీజ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదురుకోవాల్సి వస్తుందని అన్నారు .ప్రవేట్ కాలేజీ యాజమాన్యాలు ఫీజులు కట్టాలని విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నారని చదువు పూర్తయిన వారికి సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, సర్టిఫికెట్లు కొరకు అప్పులు చేసి ఫీజులు కట్టే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఇంటర్ పూర్తయి ఉన్నత చదువులు ఆపేస్తున్నారని ఆగ్రహించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యం పై దృష్టి సారించాలని విద్యార్థులకు రావలసిన ఫీజు బకాయిలను వెంటనే విడుదల చెయ్యాలని కోరారు. లేనియెడల ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు పుట్ట ఉపేందర్ యాదవ్, క్లింట్ రోచ్, గుళ్ళ మొగిలి, కొత్వాల శ్రీనివాస్, వెంకటస్వామి, నూతలపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



**ఇల్లందు ప్రతినిధి ఏప్రిల్ 24, ( తరంగాలు) :**
వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతిని తెలంగాణ ప్రభుత్వం అధికారిక పండుగగా ప్రకటిస్తూ జి.ఓ విడుదల చేయడాన్ని హర్షిస్తూ శుక్రవారం ఇల్లందులో ఆర్యవైశ్య సత్రం పునర్నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య కళ్యాణ మండపం (ఆర్యవైశ్య సత్రం)లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి యెలుగూరి నగేష్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వాసవి భక్తులకు గౌరవప్రదమని, ఆర్యవైశ్య సమాజానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లెర్ల చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు కటకం బాలకృష్ణ, పసుమర్తి శ్రీనివాస్, వాసవి క్లబ్ జోన్ చైర్మన్ బోనగిరి రవికిరణ్, వాసవి క్లబ్ పట్టణ అధ్యక్ష,కార్యదర్శులు కటకం సత్యేందర్, తీర్థాల నాగరాజు, వాసవియన్ జొన్నల ఉపేంద్రనాథ్, గ్రంథసిరి నరేందర్ పాల్గొన్నారు.

## మిషన్ భగీర పైపులైన్ లీకేజ్ కారణంగా రోడ్లపై ప్రవహిస్తున్న నీళ్లు

- అధికారుల నిర్లక్ష్యం అంటున్న ప్రజలు



**ఇల్లందు ప్రతినిధి ఏప్రిల్ 24,( తరంగాలు ):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణంలోని రైల్వే బ్రిడ్జి సమీపంలో మిషన్ బగరిథ పైపు లైన్ లీకేజ్ అవడంతో, రోడ్లపై వేలాది లీటర్ల తాగునీరు రోడ్డు పాలయ్యిందని స్థానికులు పేర్కొన్నారు. అనేకసార్లు ఇదే ప్రాంతంలో మిషన్ భగీరథ పైపుకు తాత్కాలిక మరమ్మతులు చేశారని. మిషన్ భగీరథ అధికారులు నిర్లక్ష్యం వల్ల ప్రతిసారి పైపులైన్ లీకేజ్ కావటం రోడ్డుపై ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడటం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ అధికారులు స్పందించి పైపు లీక్ కాకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



# అంగరంగ వైభవంగా ఇల్లందు మాజీ మున్సిపల్ పాలకవర్గ సభ్యుల గెట్ టుగెదర్



**ఇల్లందు ప్రతినిధి ఏప్రిల్ 24, ( తరంగాలు):**
ఇల్లందు మున్సిపల్ పాలకవర్గం 2014--2019 కి చెందిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన గెట్ టుగెదర్ కార్యక్రమం అంగరంగ వైభవంగా, ఆత్మీయ వాతావరణంలో మేడారం సమ్మక్క సారక్క సన్నిధిలో జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆనాటి ప్రస్తుత ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ మడత రమ వెంకట్ గౌడ్ ఆధ్వర్యంలో ఇల్లందు పట్టణ అభివృద్ధికి దాదాపు 120 కోట్ల నిధులు మంజూరై చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను సభ్యులు గుర్తుచేసుకున్నారు. ఆ కాలంలో చేపట్టిన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు, తాగునీటి సదుపాయాలు, వీధి దీపాలు, ఇతర మౌలిక వసతుల పనులు నేటికీ ప్రజలకు ఉపయోగపడుతున్నాయని పేర్కొంటూ అప్పటి పాలకవర్గం సమిష్టి కృషిని స్మరించారు. కలిసి పనిచేసిన రోజుల్లో ఎదుర్కొన్న అనుభవాలు, అభివృద్ధి పనుల అమలు సమయంలో ఎదురైన సవాళ్లు, ప్రజల సహకారం వంటి అంశాలను పరస్పరం చర్చించుకుంటూ సభ్యులు పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆ కాలంలో ప్రజల విశ్వాసంతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు పట్టణ రూపురేఖలను మార్చాయని, ఆ జ్ఞాపకాలు ఇప్పటికీ స్ఫూర్తినిస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సభ్యుల మధ్య ఉన్న స్నేహభావం, అనుబంధం మరింత బలపడింది.ఈ సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం లో పాల్గొన్న 22వ వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ తో పాటు మిగతా మాజీ కౌన్సిలర్ల ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆనాటి కౌన్సిలర్ బృందం మొత్తం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సభ్యులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ భవిష్యత్తులో కూడా ఇలాంటి గెట్ టుగెదర్ కార్యక్రమాలు తరచూ నిర్వహించుకోవాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమం మొత్తం స్నేహపూర్వక, ఆనందభరిత వాతావరణంలో సాగి పాల్గొన్న ప్రతి ఒక్కరికీ చిరస్మరణీయంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాస శ్రీనివాసరావు, శంకర్ పల్లి కమీషనర్ అంజన్ కుమార్, మాజీ కౌన్సిలర్లు రవి నాయక్, పర్రె స్వర్ణలత, బాధావత్ సరోజ, తులసిరామ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా పంచాయతీ రాజ్ దినోత్సవం..

**పాలేరు ఆర్సీ, ఏప్రిల్ 24 (తరంగాలు)**
గ్రామీణ ప్రాంతాల పాలనకు ఉద్దేశించిన స్థానిక సంస్థలను పంచాయతీ రాజ్ వ్యవస్థగా పేర్కొంటారని కూసుమంచి సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి అన్నారు. శుక్రవారం ఏప్రిల్ 24 సందర్భంగా కూసుమంచి గ్రామపంచాయతీ కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థ పల్లెలను శక్తివంతం చేయడంలో, సమ్మిళిత పాలన ప్రోత్సహించడంలో కీలకం అన్నారు. గ్రామాలు ప్రగతి పథంలో నడిచినప్పుడే దేశాభివృద్ధి సాధ్యం అవుతుందని తెలిపారు. పల్లెల్లో క్షేత్రస్థాయిలో మౌళిక సదుపాయాల కల్పన, పథకాల అమలు, రాజకీయ చైతన్యం, నిధులను సక్రమంగా సద్వినియోగం చేయడం లాంటి వాటికోసం ఏర్పాటు చేసిన వ్యవస్తే పంచాయతీ రాజ్ వ్యవస్థ అని వివరించారు. ఇందులో స్థానిక సమస్యలను స్థానికులే గుర్తించి క్షేత్రస్థాయిలో నిధులు సమీకరించి, ప్రణాళిక రూపొందించి అమలు చేసి పరిష్కరిస్తారు. పాలకుల్లో జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు గ్రామాల్లో సుస్థిరాభివృద్ధిని నెలపొల్పేందుకు పంచాయతీ రాజ్ వ్యవస్థ దోహదం చేస్తుందని తెలిపారు.




ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖనుంచి పాల్గొన్న ఏఎన్ఎం ధనలక్ష్మి మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలంటే ముందుగా శుభ్రత ప్రధానమైనదని అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండి, ప్రజలంతా శుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండా క్రిష్ణవేణి, ఉపసర్పంచ్ చెన్ను వెంకటరమణ, పాలకమండలి సభ్యులు చెరుకుపల్లి వీరయ్య, అర్వపల్లి ఉపేందర్, మంద నవ్య, అంతోటి వెంకన్న, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సీతారామచంద్ర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు





**నల్లబెల్లి ,ఏప్రిల్ 24 తరంగాలు :**
నల్లబెల్లి శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఈ నెల 26, 27 తేదీలలో వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరగనున్నాయి. జై శ్రీరామ్ నినాదాలతో ఆలయ పరిసరాలు ఉత్సవ వాతావరణం సంతరించుకున్నాయి. 26వ తేదీ ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించనున్నారు. 27వ తేదీ సోమవారం ఉదయం ఐదు గంటలకు స్వామివారి అలంకరణ మహోత్సవం, ఆరు గంటలకు ధ్వజారోహణం జరుగుతుంది. తర్వాత ఏడు గంటలకు మంటప పూజ, తొమ్మిది గంటలకు సుదర్శన శాంతి హోమం, అష్టదిగ్బంధన బలిహరణ నిర్వహించనున్నారు. ఉదయం పదకొండు గంటలకు శ్రీ సీతారామ కళ్యాణం, అనంతరం తీర్థప్రసాద వితరణ జరుగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. భక్తులందరూ సకాలంలో విచ్చేసి స్వామివారి అనుగ్రహం పొందాలని నిర్వాహకులు కోరుతున్నారు.

## వాసవి జయంతికి అధికారిక గుర్తింపు - ఆర్యవైశ్యుల ఆనందం

**నల్లబెల్లి, ఏప్రిల్ 24 తరంగాలు :**
ఆర్యవైశ్యుల కులదేవత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్నట్లు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ నల్లబెల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నీల వెంకటేశ్వర్లు గుప్తా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



గత కొన్నేళ్లుగా వాసవి మాత జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆర్యవైశ్యులు కోరుకుంటున్నారని, ఆ ఆకాంక్షను నెరవేర్చినందుకు ప్రభుత్వం అభినందనీయమన్నారు. ఈ నిర్ణయం సమాజానికి గౌరవాన్ని తీసుకువస్తుందని ఆయన పేర్కొన్నారు. అలాగే ఈ కార్యక్రమానికి సహకరించిన ఆర్యవైశ్య మహాసభ నాయకులు, రాష్ట్ర మంత్రివర్గ సభ్యులకు మండల సంఘం తరఫున ధన్యవాదాలు తెలిపారు. వాసవి జయంతి అధికారిక నిర్వహణతో ఆర్యవైశ్యుల ఐక్యత మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# కొల్లూరి దేవేందర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే నాగరాజు



**హైదరాబాద్, ఏప్రిల్ 24,తరంగాలు :** గాయపడిన కాంగ్రెస్ కార్యకర్త కొల్లూరి దేవేందర్‌ను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పరామర్శించారు.వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కొల్లూరి దేవేందర్ ఇటీవల గడ్డి కట్టలు కట్టే యంత్రంలో చేయి వేళ్లు చిక్కుకుని తీవ్రంగా గాయాలుకావడంతో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రి లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఆస్పత్రికి వెళ్లి దేవేందర్‌ను పరామర్శించి మనోధైర్యం కల్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి దేవేందర్‌కు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు పిన్నింటి అనిల్ రావుతో పాటు ఇతర నాయకులు, పాల్గొన్నారు.

# కుళ్ళ యాకాంతం కు కాంగ్రెస్ నాయకుల పరామర్శ



**వర్ధన్నపేట ప్రతినిధి, ఏప్రిల్ 24,తరంగాలు** : కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట మండల యూత్ ఉపాధ్యక్షులు కుళ్ళ యాకాంతం ను వర్ధన్నపేట కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు.వర్ధన్నపేట మండలం, వెంకట్రావుపల్లి(బొక్కలగూడెం)గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట మండల యూత్ ఉపాధ్యక్షులు, వెంకట్రావుపల్లి గ్రామ సర్పంచ్ కుళ్ళ పావని భర్త కుళ్ళ యాకాంతం కు ఇటీవల మైనర్ శస్త్ర చికిత్స జరికి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు.విషయం తెలుసుకున్న వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ఎద్దు సత్య నారాయణ,ఐనవోలు టెంపుల్ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబిడీ రాజ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు పోషాల వెంకన్న గౌడ్ వెంకట్రావుపల్లి గ్రామంలోని యాకాంతం నివాసానికి వెళ్లి కుళ్ళ యాకాంతం ను పరామర్శించి, తన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా యాకాంతం త్వరగా కోలుకొని మళ్ళీ పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆశభావం వ్యక్తం చేశారు.

# వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పట్టుదల ఫలితం

- వరంగల్ టెక్స్టైల్ పార్క్‌కు కేంద్రం భరోసా



**వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 24,తరంగాలు** :వరంగల్ అభివృద్ధి పట్ల అంకితభావంతో ముందుకు సాగుతున్న వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మరోసారి తన సంకల్పబలం చాటారు. వరంగల్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ త్వరితగతిన ప్రారంభం అయ్యేలా కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని లోక్‌సభలో రూల్ 377 కింద ప్రస్తావించారు. ప్రధానంగా పార్క్ త్వరితగతిన ప్రారంభం కావడానికి అవసరమైన ఆర్థిక, మౌలిక వసతుల మద్దతు పెంచాలని కేంద్రాన్ని ఎంపీ కోరారు. ప్రధాని మిత్ర పథకం కింద ఈ ప్రాజెక్ట్‌ను ప్రాధాన్యంగా తీసుకోవాలని స్పష్టం చేశారు.వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య వినతిపై స్పందించిన కేంద్ర టెక్స్టైల్స్ మంత్రి గిరిరాజ్ సింగ్, ఇప్పటికే రూ.30 కోట్ల తొలి విడత నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. తదుపరి విడత నిధులు అర్హతల ప్రకారం విడుదల చేస్తామని వెల్లడించారు. పరిశ్రమలను ఆకర్షించేందుకు రూ.300 కోట్ల వరకు ఆకర్షణాత్మక ప్రోత్సాహకాలు అందుబాటులో ఉన్నాయని మంత్రి వివరించారు. పీఎల్ఐ, సమర్థ్ వంటి పథకాల ద్వారా కూడా యూనిట్లు లబ్ధి పొందగలవని సూచించారు.తెలంగాణ ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్తామని కేంద్రం స్పష్టం చేసింది. అవసరమైన మేరకు అదనపు సహాయం ప్రతిపాదనలను పరిశీలిస్తామని తెలిపింది.వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య నిరంతర అనుసరణతో ఈ ప్రాజెక్ట్ వేగం పెరిగింది. ఈ టెక్స్టైల్ పార్క్ ద్వారా వరంగల్‌లో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు విస్తృతంగా పెరగనున్నాయి.

# దళారులను నమ్మి మోసపోవద్దు





- తరాల్లపల్లి, కడిపికొండ గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 24,తరంగాలు** : దళారులను నమ్మి మోసపోవద్దని కాంగ్రెస్ నాయకులు అన్నారు.శుక్రవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు ఆదేశాల మేరకు 45వ డివిజన్ లో తరాల్లపల్లి, కడిపికొండ గ్రామాలలో ప్రాధమిక వ్యవసాయ సొసైటీ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రలు ప్రారంభోత్సవం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి అగ్రికల్చర్ ఆఫీసర్ సంతోష్ ,జిల్లా కాంగ్రెస్ నాయకులు కర్ర హరీష్ రెడ్డి, మాజి పాక్స్ వైస్ చైర్మన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షులు సారాంపల్లి శ్రీనివాస్ రెడ్డి,44డివిజన్ అధ్యక్షులు రాజరాపు స్వామి,సీనియర్ నాయకులు జక్కుల సదానందం,మాజి సర్పంచ్ యాదవ్ రెడ్డి, స్వామి,గ్రామ అధ్యక్షులు ఎండ్ బషీర్,దాడబోయిన రాజు యాదవ్,మాతంగి రవి,కరుణాకర్ సీనియర్ నాయకులు కొండయ్య,సాంబయ్య, బిక్షపతి,కార్తీక్ యాదవ్,కృష్ణ,నరేష్, పరమేష్,దమ్ము రాజు,వివిధ పార్టీ రాజకీయ నాయకులు,రైతులు పెద్ద ఎత్తున పాల్గున్నారు ,మండల వ్యవసాయ అధికారులు, సొసైటీ అధికారులు పాల్గున్నారు.

# అంగన్వాడి కేంద్రానికి ఫర్నిచర్ పంపిణి





- ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్లు , టేబుల్ అందజేసిన ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి

**రాయపర్తి, ఏప్రిల్ 24,తరంగాలు** :అంగన్వాడి కేంద్రానికి ఎస్సార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ఫర్నిచర్ అందజేశారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలోస్థానిక నాయకుల విన్నపం మేరకు అంగన్వాడి కేంద్రం లో పిల్లలకు కూర్చోడానికి ఇబ్బంది అవుతుందని తెలుసుకున్న ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డిఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పిల్లలకు 15 చిన్న చైర్లు , సిబ్బంది కి ఒక టేబుల్, 10 కుర్చీలు పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, రాయపర్తి మాజీ సర్పంచ్ గారే నర్సయ్య, మాజీ ఎంపీటీసీ ఐత రామ్ చందర్, గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి చందు రామ్, మండల పార్టీ నాయకులు సంధి దేవేందర్ రెడ్డి, పెండ్లి సుధాకర్ రెడ్డి, చిన్నల ఉప్పలయ్య, ఐత కుమార్, కుంట రాంబాబు, జీవన్, ఐత రవి,తదితరులు పాల్గొన్నారు.

# శంకర్‌గౌడ్‌కు నివాళులు






- ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి -- కేంద్ర మంత్రి బండి సంజయ్
- నర్సంపేట డిపోలో నివాళులు అర్పించిన కేంద్ర మంత్రి
- ప్రభుత్వ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం
- కార్మికులకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన బీజేపీ

**డెస్క్, ఏప్రిల్ 24** ఆత్మబలిదానం చేసుకున్న ఆర్టీసీ కార్మికుడు కోల శంకర్‌గౌడ్ భౌతికకాయాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ సందర్శించి నివాళులు అర్పించారు. 22 ఏళ్ల పాటు ఆర్టీసీకి సేవలందించిన శంకర్‌గౌడ్ మృతిపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నర్సంపేట డిపోలో సహచర కార్మికులు, కుటుంబ సభ్యులు చివరిసారిగా భౌతికకాయాన్ని చూసే అవకాశం కల్పించాలని కోరినా ప్రభుత్వం అనుమతించలేదని ఆయన ఆరోపించారు. దుఃఖంలో ఉన్న వారిపై పోలీసులను ప్రయోగించడం మానవత్వానికి విరుద్ధమని విమర్శించారు. ఆర్టీసీ కార్మికుల పరిస్థితి చూస్తే ఆవేదన కలుగుతోందని, వారి పట్ల ప్రభుత్వం కఠిన వైఖరి అవలంబించడం ఆగ్రహానికి దారి తీస్తోందని తెలిపారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఆత్మబలిదానాలు మరలా జరగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్మికులు ఆత్మహత్యల వంటి తీవ్రమైన నిర్ణయాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ కార్మికుల పోరాటానికి బీజేపీ సంపూర్ణ మద్దతు ఉంటుందని బండి సంజయ్ స్పష్టం చేశారు. కార్మికుల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ ఘటనతో రాష్ట్ర రాజకీయాల్లో ఉద్రిక్తత కొనసాగుతుండగా, ప్రభుత్వం-ప్రతిపక్షాల మధ్య విమర్శలు మరింత ముదురుతున్నాయి.



# తెలంగాణలో ఐపీఎస్ అధికారుల బదిలీలు

- కీలక పోస్టుల్లో మార్పులు
- పలువురు ఉన్నతాధికారులకు కొత్త బాధ్యతలు
- విజిలెన్స్, ఇంటెలిజెన్స్ విభాగాల్లో కీలక నియామకాలు
- పోలీసు వ్యవస్థలో పునర్వ్యవస్థీకరణ




**హైదరాబాద్, ఏప్రిల్ 24 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** తెలంగాణలో పలువురు ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేస్తూ కీలక పోస్టుల్లో మార్పులు చేపట్టింది. పరిపాలన సామర్థ్యాన్ని మెరుగుపర్చే దిశగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచారం. ఈ బదిలీల్లో భాగంగా శిఖా గోయల్‌ను హోమ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమించారు. దేవేంద్ర సింగ్ చౌహాన్‌ను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు అప్పగించారు.షాహ్నవాజ్ ఖాసిం ఐజీపీగా మల్టీ జోన్-2కి పోస్టింగ్ ఇవ్వగా, తరుణ్ జోషిని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్‌గా నియమించారు. అవినాష్ మొహంతిని డ్రగ్స్ కంట్రోల్ అండ్ ఎక్సైజ్ డీజీగా బదిలీ చేశారు.సుమతిని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌గా నియమించగా, కార్తికేయకు ఎస్ఐబీ ఇంటెలిజెన్స్ విభాగంలో అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక పలు అధికారులకు అదనపు ఛార్జ్ బాధ్యతలను కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మార్పులతో పోలీసు శాఖలో సమన్వయం, కార్యనిర్వహణ మరింత బలోపేతం అవుతుందని అధికారులు భావిస్తున్నారు. పోలీసు వ్యవస్థలో సమర్థతను పెంచడం, విభాగాల పనితీరును మెరుగుపరచడం లక్ష్యంగా ఈ బదిలీలు చేపట్టినట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

# ఆర్టీసీ ఘటనపై బీఆర్ఎస్ ఘాటు విమర్శలు

- ప్రభుత్వం వైఖరిపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర వ్యాఖ్యలు
- శంకర్‌గౌడ్ మృతికి సంతాపం, 'ప్రభుత్వ వైఫల్యం'గా వ్యాఖ్యానం
- పోలీసు చర్యలు, కేసులపై ఆందోళన వ్యక్తం
- ప్రజాస్వామ్యానికి ముప్పు ఉందని హెచ్చరిక




**హైదరాబాద్, ఏప్రిల్ 24 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆర్టీసీ డ్రైవర్ కోల శంకర్‌గౌడ్ మృతిపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ ఘటనను ప్రభుత్వ వైఖరి కారణంగా జరిగిన విషాదంగా అభివర్ణిస్తూ, కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.ఆర్టీసీ కార్మికుడి ఆత్మహత్యను ప్రభుత్వం చేసిన హత్యగా భావిస్తున్నామని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. కార్మికులు తమ హక్కుల కోసం పోరాడుతుండగా వారిని అణచివేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తాండూరు ప్రాంతంలో ఆర్టీసీ కార్మికులకు టెంట్ సామగ్రి ఇవ్వొద్దని పోలీసుల నుంచి నోటీసులు జారీ కావడం ఆందోళనకరమని పేర్కొన్నారు.ప్రభుత్వాన్ని ప్రశ్నించే స్వరాలను అణచివేయడానికి అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. జర్నలిస్టులపై కూడా కేసులు నమోదు చేసే పరిస్థితి ఏర్పడుతోందని, ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతమని అన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వార్తల ఆధారంగా కేసులు నమోదు చేయొద్దని ఉన్నప్పటికీ, విభిన్న చట్టాల పేరుతో కఠిన చర్యలు తీసుకుంటున్నారని విమర్శించారు. యాంటి టెర్రర్ చట్టాలను సామాన్య ప్రజలపై ఉపయోగించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. ఈ విధానం కొనసాగితే భవిష్యత్తులో తెలంగాణ ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల్లో భయాందోళనలకు దారి తీస్తున్నాయని పేర్కొన్నారు.ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపడం అన్యాయమని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో అభిప్రాయాలు వ్యక్తం చేసే వారిపై చర్యలు తీసుకోవడం సరికాదని, ప్రజలకు స్వేచ్ఛగా మాట్లాడే హక్కు ఉండాలని తెలిపారు.పోలీసు అధికారులకు ఆయన ప్రత్యేకంగా సూచనలు చేశారు. చట్టానికి లోబడి మాత్రమే పనిచేయాలని, ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా న్యాయపరంగా వ్యవహరించాలని కోరారు. సీక్రెట్ సంస్థలను బహిర్గతం చేయడం సరైంది కాదని, భద్రతా వ్యవస్థల గోప్యతను కాపాడాలని సూచించారు.ప్రభుత్వంపై విభిన్న అంశాలపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పిస్తూ, ప్రజల సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి, ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రెస్‌మీట్‌తో రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి ఉద్రిక్తత నెలకొంది. ప్రభుత్వం-ప్రతిపక్షాల మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు మరింత ముదురుతున్నాయి.

# శంకర్‌గౌడ్ మృతిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంతాపం

- చర్చల ద్వారానే సమస్యల పరిష్కారం అన్న భట్టి
- ప్రాణాలు తీసుకోవడం సరైన మార్గం కాదని హితవు
- ఆర్టీసీ బలోపేతానికి హామీ



**డెస్క్, ఏప్రిల్ 24 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** ఆర్టీసీ డ్రైవర్ కోల శంకర్‌గౌడ్ మృతిపై తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సచివాలయంలో మంత్రుల బృందంతో కలిసి ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ నేతలతో భేటీ అయిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సమస్యలు ఎంత క్లిష్టమైనా చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని, ప్రాణాలు తీసుకోవడం సరైన నిర్ణయం కాదని భట్టి విక్రమార్క హితవు పలికారు. ఇది ప్రజల ప్రభుత్వం అని, ఎవరినీ శత్రువులుగా చూడబోమని స్పష్టం చేశారు. గత పదేళ్లలో ఆర్టీసీ పరిస్థితి దెబ్బతిన్నదని, ఆ సమయంలో కార్మికుల పట్ల పాలకులు కఠినంగా వ్యవహరించారని ఆయన వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం అలాంటి విధానాన్ని అనుసరించదని భరోసా ఇచ్చారు.వివిధ రాష్ట్రాల ఎన్నికల ప్రచారం, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలతో బిజీగా ఉన్న సమయంలో అకస్మాత్తుగా సమ్మె నిర్ణయం తీసుకోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. శంకర్‌గౌడ్ మృతి బాధాకరమని పేర్కొన్నారు.ఆర్టీసీని బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి విక్రమార్క తెలిపారు. కార్మికుల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరిస్తామని, చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం కనుగొంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం, కార్మిక సంఘాల మధ్య జరగబోయే చర్చలు కీలకంగా మారగా, ఈ సమావేశాలు ఆర్టీసీ సమస్యల పరిష్కారానికి మార్గం చూపే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ అంత్యక్రియలు ఉద్రిక్తతల మధ్య పూర్తి



- మృతదేహం తరలింపుపై కార్మికులు--పోలీసుల మధ్య ఉద్రిక్తత
- విపక్షాల మద్దతు, కేంద్రమంత్రి బండి సంజయ్ ఆందోళన
- చర్చల అనంతరం కుటుంబ సమ్మతితో అంతిమకార్యాలు

వరంగల్, ఏప్రిల్ 24 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో బలవన్మరణానికి పాల్పడిన డ్రైవర్ శంకర్ గౌడ్ అంత్యక్రియలు తీవ్ర ఉద్రిక్తతల మధ్య పూర్తయ్యాయి. మృతదేహాన్ని నర్సంపేట డిపోకు తరలించాలన్న కార్మికులు, కుటుంబ సభ్యుల డిమాండ్ ఉద్రిక్తతలకు దారితీసింది. హైదరాబాద్ నుంచి మృతదేహాన్ని నర్సంపేట మండలం ముత్తోజిపేటలోని ఆయన కుమార్తె ఇంటికి తీసుకువచ్చారు. అక్కడికి చేరుకున్న ఆర్టీసీ కార్మికులు, విపక్ష నేతలు, కుటుంబ సభ్యులు మృతదేహాన్ని డిపోకు తీసుకెళ్లి నివాళులు అర్పించేందుకు అనుమతించాలని పోలీసులను కోరారు. అయితే పోలీసులు అనుమతి నిరాకరించడంతో నర్సంపేట--మల్లంపల్లి రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టారు.ఈ క్రమంలో పోలీసులు, కార్మికులు, రాజకీయ కార్యకర్తల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. బీఆర్ఎస్ నేతలను కూడా పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. కార్మికులు, కార్యకర్తలు నినాదాలతో ఆందోళన వ్యక్తం చేశారు.మధ్యాహ్నం ముత్తోజిపేటకు చేరుకున్న కేంద్రమంత్రి బండి సంజయ్ శంకర్ గౌడ్ మృతదేహానికి నివాళులు అర్పించారు. డిపోకు తీసుకెళ్లకుండా అడ్డుకోవడంపై పోలీసులను ప్రశ్నిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు, కుటుంబ సభ్యుల అభ్యర్థనను పరిగణలోకి తీసుకోవాలని ఆయన కోరారు.తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల అనంతరం పోలీసులు, కుటుంబ సభ్యులు, ఆర్టీసీ జేఏసీ నేతల మధ్య చర్చలు జరగడంతో సమస్య పరిష్కారమైంది. అనంతరం కుటుంబ సభ్యులు అంత్యక్రియలకు అంగీకరించగా, శంకర్ గౌడ్ అంతిమయాత్ర నిర్వహించి చివరి కార్యక్రమాలు పూర్తిచేశారు. ఇక శంకర్ గౌడ్ మృతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నిస్తుందని, చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకుంటామని తెలిపారు.

# బస్తీల్లో తాగునీటి సౌకర్యాల విస్తరణ

- కిషన్ రెడ్డి కార్యక్రమం
- సికింద్రాబాద్ నియోజకవర్గంలో బోర్‌వెల్లుల ప్రారంభం
- వేసవిలో నీటి సమస్యలకు ఉపశమనం లక్ష్యం
- పలుచోట్ల బస్తీలకు తాగునీటి అందుబాటు పెంపు



**సికింద్రాబాద్, ఏప్రిల్ 24 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి సికింద్రాబాద్ లో పలు బస్తీల్లో తాగునీటి సౌకర్యాలను విస్తరించే కార్యక్రమాన్ని చేపట్టారు. రహ్మత్ నగర్, కార్మిక నగర్, ఇందిరా నగర్ దశలు 1, 2 ప్రాంతాల్లో పవర్ బోర్‌వెల్లులను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వేసవి కాలంలో తాగునీటి కొరత తీవ్రంగా ఉండే ప్రాంతాలను గుర్తించి ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా సాధారణ నీటి సరఫరా అందుబాటులో లేని బస్తీలకు ఇది ఎంతో ఉపశమనం కలిగిస్తుందని పేర్కొన్నారు.బోర్‌వెల్లుల ప్రారంభంతో స్థానిక ప్రజలకు తాగునీరు సులభంగా అందే పరిస్థితి ఏర్పడనుంది. నీటి కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా బస్తీ ప్రాంతాల్లో జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అధికారులు భావిస్తున్నారు. వేసవిలో పెరిగే నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి మరిన్ని ప్రాజెక్టులను చేపట్టే యోచనలో ఉన్నట్లు సమాచారం.ప్రజల ప్రాథమిక అవసరాలపై దృష్టి పెట్టడం ప్రభుత్వ బాధ్యతగా ఉందని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ తరహా కార్యక్రమాలు కొనసాగుతాయని, ప్రతి బస్తీకి తాగునీటి సౌకర్యాలు అందేలా కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ బోర్‌వెల్లుల ప్రారంభంతో బస్తీల్లో నీటి సమస్య కొంతవరకు తగ్గే అవకాశం ఉందని స్థానిక ప్రజలు భావిస్తున్నారు. వేసవి కాలంలో ఈ సౌకర్యాలు వారికి ఎంతో ఉపశమనం కలిగించనున్నాయి.

# శంకర్ గౌడ్ ది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ హత్యే

- డాక్టర్ వన్నాల వెంకట రమణ



వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 24,తరంగాలు : ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ హత్యే అని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకట రమణ అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ మొండి వైఖరి, నిర్లక్ష్యం వల్లే నర్సంపేట ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ బలిదానం చేసుకున్నారు. వారి పార్థివదేహానికి నివాళులు అర్పించి నిరసన కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తో రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూఇది ఆత్మహత్య కాదు, ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ హత్యే అని అన్నారు.39 వేల మంది కార్మికులు సమ్మె చేస్తుంటే, 10 వేల బస్సులు ఆగిపోయి 60 లక్షల మంది సామాన్య ప్రయాణికులు ఇబ్బందులు పడుతుంటే ఈ ప్రభుత్వానికి కనీస సోయి లేదు. పవిత్ర గ్రంథాలు, మ్యానిఫెస్టోలు పట్టుకుని 100 రోజుల్లోనే సమస్యలు పరిష్కరిస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇన్ని రోజులు గడుస్తున్నా కార్మికులను మోసం చేస్తూనే ఉంది. గత ప్రభుత్వం కూడా ఇదే తరహాలో ఉక్కుపాదం మోపి కార్మికుల ఉసురు తీసింది.మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లకు, వాళ్ళ ధర్మ పోరాటానికి భారతీయ జనతా పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోంది. కార్మికులకు నాదొక్కటే విజ్ఞప్తి... దయచేసి ఆత్మహత్యలు చేసుకోవద్దు, మన హక్కుల కోసం ఉండి కొట్లాడదాం, బిజెపి మీకు అండగా ఉంటుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు.



# ట్రంప్ వ్యాఖ్యలపై అంతర్జాతీయ దుమారం

- ఇరాన్ కాన్సులేట్ సాటైర్ కౌంటర్
- భారత్, చైనా పై వ్యాఖ్యలు వివాదం
- ట్రూత్ సోషల్ రీపోస్ట్‌తో పెరిగిన వేడి
- ముంబై నుంచి ఇరాన్ కాన్సులేట్ చురకలు



**ముంబై, ఏప్రిల్ 24**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన తాజా వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. జన్మతహ పౌరసత్వంపై ఆయన తీసుకున్న వైఖరి ఇప్పటికే విమర్శలకు గురవుతుండగా, భారత్, చైనా దేశాలను నరకూపాలతో పోల్చిన వ్యాఖ్యలు మరింత వివాదాస్పదంగా మారాయి. ఈ వివాదానికి కారణం అమెరికాకు చెందిన రేడియో వ్యాఖ్యాత మైఖేల్ సావేజ్ చేసిన వ్యాఖ్యలను ట్రంప్ తన ట్రూత్ సోషల్ వేదికలో పునఃప్రచారం చేయడమే. ఆ వ్యాఖ్యలను సమర్థిస్తున్నట్టుగా కనిపించిన ఈ చర్యపై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర స్పందన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా భారతదేశంపై చేసిన వ్యాఖ్యలు దేశీయంగా కూడా ఆగ్రహానికి దారి తీస్తున్నాయి.

ఈ నేపథ్యంలో ఇరాన్ నుంచి గట్టి ప్రతిస్పందన వెలువడింది. ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ తమ సామాజిక మాధ్యమ ఖాతాలో ప్రత్యేక వీడియోను పంచుతూ ట్రంప్ వ్యాఖ్యలకు పరోక్షంగా కౌంటర్ ఇచ్చింది. మహారాష్ట్ర సాంస్కృతిక, సహజ సంపదలను ప్రతిబింబించే దృశ్యాలతో ఆ వీడియోను రూపొందించారు. "కభీ ఇండియా ఆకే దేఖో.. ఫిర్ బోల్నా" అంటూ చేసిన వ్యాఖ్యలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. భారతదేశాన్ని ప్రత్యక్షంగా సందర్శిస్తే వాస్తవ పరిస్థితులు తెలుస్తాయని, అప్పుడు ఇలాంటి వ్యాఖ్యలు చేయరని సూచించారు. ట్రంప్ వ్యాఖ్యలకు నేరుగా స్పందించకుండా వ్యంగ్యంగా చురకలు వేయడం గమనార్హం.

ఈ పోస్టు సామాజిక మాధ్యమాల్లో వేగంగా వైరల్ అవుతోంది. అంతర్జాతీయ రాజకీయాల్లో మాటల యుద్ధం ఎలా ముదురుతుందో ఈ ఘటన మరోసారి స్పష్టం చేసింది. దేశాల మధ్య సంబంధాలపై ఇలాంటి వ్యాఖ్యలు ప్రభావం చూపే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇక ట్రంప్ వ్యాఖ్యలపై ఇతర దేశాల నుంచి కూడా స్పందనలు కొనసాగుతున్నాయి. ప్రపంచ నాయకులు చేసే వ్యాఖ్యలు ఎంత ప్రాముఖ్యత కలిగివుంటాయో, వాటి ప్రభావం ఎంత విస్తృతంగా ఉంటుందో ఈ ఘటన మరోసారి చూపించింది.

## ప్రపంచ శాంతి స్థాపనలో దౌత్యవేత్తల పాత్ర


- ఐక్యరాజ్యసమితి లక్ష్యాల సాధనలో ప్రతినిధుల కృషి
- అంతర్జాతీయ సంబంధాలు సత్సంబంధాల పెంపుదల
- భవిష్యత్తు తరాలకు శాంతియుత ప్రపంచాన్ని అందించే సంకల్పం



**డెస్క్, ఏప్రిల్ 24** : ప్రతి ఏటా ఏప్రిల్ 25వ తేదీని అంతర్జాతీయ ప్రతినిధుల దినోత్సవంగా ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారు. ఐక్యరాజ్యసమితిలో సభ్య దేశాల తరపున ప్రాతినిధ్యం వహిస్తూ ప్రపంచ శాంతి, భద్రత కోసం నిరంతరం శ్రమించే ప్రతినిధుల సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటారు. 1945లో శాన్ ఫ్రాన్సిస్కోలో జరిగిన ఐక్యరాజ్యసమితి సదస్సులో పాల్గొన్న ప్రతినిధుల చారిత్రాత్మక నిర్ణయాలకు గుర్తుగా ఈ రోజును జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. వివిధ దేశాల మధ్య ఉన్న విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించడం, మానవ హక్కుల రక్షణకు కృషి చేయడం వంటి కీలక బాధ్యతలను వీరు నిర్వహిస్తారు. ప్రపంచ వేదికపై తమ దేశ గళాన్ని వినిపిస్తూనే, ప్రపంచ శ్రేయస్సు కోసం ఇతర దేశాలతో కలిసి పనిచేయడం వీరి వృత్తిలో ఉన్న గొప్పతనం. దౌత్య నీతి ద్వారా యుద్ధాలను నివారించి శాంతిని నెలకొల్పడంలో ప్రతినిధుల పాత్ర ఎంతో కీలకమైనది.ప్రతినిధులు కేవలం తమ దేశ ప్రయోజనాలకే పరిమితం కాకుండా ప్రపంచం ఎదుర్కొంటున్న ఉమ్మడి సమస్యలపై దృష్టి సారిస్తారు. వాతావరణ మార్పులు, పేదరికం, ఆకలి చావులు, అంటువ్యాధుల వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రణాళికలు రూపొందించడంలో వీరు ముందుంటారు. ఐక్యరాజ్యసమితి సాధారణ అసెంబ్లీలో జరిగే చర్చలు, ఓటింగ్‌ల ద్వారా ప్రపంచ భవిష్యత్తును నిర్ణయించే తీర్మానాలను వీరు ఆమోదిస్తారు. చర్చల సమయంలో సహనం, విచక్షణతో వ్యవహరిస్తూ అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాలను కనుగొనడం వీరి ప్రధాన బాధ్యత. బహుళ పక్ష దౌత్యం బలోపేతం కావడానికి ప్రతినిధుల మధ్య ఉండే సమన్వయం ఎంతో అవసరం. వివిధ సంస్కృతులు, భాషలు, సిద్ధాంతాలు కలిగిన దేశాలను ఒకే తాటిపైకి తీసుకురావడం అనేది సామాన్యమైన విషయం కాదు. ఈ క్లిష్టమైన ప్రక్రియలో ప్రతినిధులు చూపే చాకచక్యం అభినందనీయం.దౌత్యవేత్తలు చేసే కృషి వల్లనే అంతర్జాతీయ వాణిజ్యం, సాంస్కృతిక మార్పిడి సజావుగా సాగుతున్నాయి. రెండు దేశాల మధ్య తలెత్తే సరిహద్దు వివాదాలు లేదా వాణిజ్య పరమైన చిక్కులను యుద్ధం వరకు వెళ్లకుండా దౌత్యపరమైన చర్చలతో పరిష్కరించడం వీరి నైపుణ్యానికి నిదర్శనం. విదేశాల్లో ఉన్న తమ దేశ పౌరుల రక్షణ, వారి సంక్షేమం కోసం ప్రతినిధులు నిరంతరం పని చేస్తారు. విపత్తుల సమయంలో ఇతర దేశాల నుండి సహాయ సహకారాలు పొందేలా చూడటంలో వీరి పాత్ర మరువలేనిది. అంతర్జాతీయ ఒప్పందాలు కుదుర్చుకోవడం, వాటిని అమలు చేయడంలో ఎదురయ్యే అడ్డంకులను తొలగించడం వీరి దైనందిన విధుల్లో భాగం. శాంతియుత సహజీవనం అనే సూత్రంపై ఆధారపడి ప్రపంచ దేశాలన్నీ ముందుకు సాగడానికి వీరు ఒక వారధిలా పనిచేస్తారు.ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో ప్రతినిధుల పాత్ర అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. 2030 నాటికి ప్రపంచం నుండి పేదరికాన్ని నిర్మూలించడం, నాణ్యమైన విద్యను అందించడం, లింగ వివక్షను తొలగించడం వంటి 17 లక్ష్యాల అమలుపై వీరు పర్యవేక్షణ చేస్తారు. నిధుల కేటాయింపు నుండి క్షేత్రస్థాయిలో పథకాల అమలు వరకు ప్రతి అడుగులోనూ ప్రతినిధుల సలహాలు, సూచనలు ఎంతో విలువైనవి. వెనుకబడిన దేశాలకు అభివృద్ధి చెందిన దేశాల నుండి సాంకేతిక, ఆర్థిక సహాయం అందేలా చేయడంలో వీరు కీలక పాత్ర పోషిస్తారు. ప్రపంచవ్యాప్తంగా సమానత్వాన్ని తీసుకురావడం, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడటం వీరి ఉమ్మడి లక్ష్యం. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ప్రతినిధులు ఎదుర్కొనే సవాళ్లు అనేకమైనా, వారు తమ లక్ష్యం నుండి వెనకడుగు వేయరు.ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో ప్రతినిధుల బాధ్యత మరింత పెరిగింది. రష్యా-ఉక్రెయిన్ సంక్షోభం లేదా మధ్యప్రాచ్య దేశాల్లో నెలకొన్న ఉద్రిక్తతల వంటి సమయాల్లో ప్రపంచ శాంతికి ముప్పు వాటిల్లకుండా చూడటంలో వీరు నిరంతరం శ్రమిస్తున్నారు. మానవతా దృక్పథంతో బాధితులకు సాయం అందించడం, కాల్పుల విరమణ ఒప్పందాలు కుదిరేలా చూడటం వంటివి వీరి దౌత్య విజయంపైనే ఆధారపడి ఉంటాయి. అణ్వాయుధాల నియంత్రణ, ఉగ్రవాద నిర్మూలన వంటి అంశాలపై ప్రపంచ దేశాలను ఏకం చేయడం వీరు చేస్తున్న గొప్ప పోరాటం. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన నేటి కాలంలో సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కొత్త సవాళ్లను ఎదుర్కోవడానికి అంతర్జాతీయ చట్టాలను రూపొందించడంలో ప్రతినిధులు బిజీగా ఉన్నారు. మార్పు చెందుతున్న ప్రపంచానికి అనుగుణంగా దౌత్య నీతిని కూడా వీరు ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకుంటున్నారు.ప్రతినిధుల దినోత్సవం సందర్భంగా యువతకు దౌత్య రంగంపై అవగాహన కల్పించడం అవసరం. భవిష్యత్తులో దేశానికి ప్రాతినిధ్యం వహించాలనుకునే విద్యార్థులు అంతర్జాతీయ వ్యవహారాలపై పట్టు సాధించాలి. వివిధ దేశాల చరిత్ర, సంస్కృతి, రాజకీయ పరిస్థితులను అధ్యయనం చేయడం ద్వారా మంచి దౌత్యవేత్తలుగా ఎదగవచ్చు. ప్రపంచ శాంతి కోసం పనిచేయడం అనేది ఒక గౌరవప్రదమైన వృత్తి మాత్రమే కాదు, అది ఒక గొప్ప సామాజిక సేవ. నేటి యువత శాంతి దూతలుగా మారి ప్రపంచ వేదికలపై భారత కీర్తిని ఇనుమడింపజేయాలి. విద్యా సంస్థల్లో మాక్ యూఎన్ వంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, చర్చా నైపుణ్యాలను పెంపొందించవచ్చు. యువత ఆలోచనలు, నూతన ఆవిష్కరణలు ప్రపంచ సమస్యలకు పరిష్కార మార్గాలు చూపగలవు.ప్రతినిధులు పనిచేసే పరిస్థితులు ఎప్పుడూ అనుకూలంగా ఉండవు. ఒక్కోసారి తీవ్రమైన ఒత్తిడి, రాజకీయ విభేదాల మధ్య వారు నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. తమ దేశ ప్రయోజనాలను కాపాడుకుంటూనే ప్రపంచ ప్రయోజనాలకు భంగం కలగకుండా చూసుకోవడం కత్తిమీద సాము లాంటిదే. అయినప్పటికీ, వారు చర్చలనే తమ ఆయుధంగా చేసుకుని సమస్యలను పరిష్కరిస్తారు. ప్రతినిధుల మధ్య ఉండే స్నేహపూర్వక సంబంధాలు దేశాల మధ్య శత్రుత్వాన్ని తగ్గించడానికి దోహదపడతాయి. అనౌపకారికి భేటీలు, ద్వైపాక్షిక చర్చల ద్వారా అనేక క్లిష్టమైన సమస్యలు సులువుగా పరిష్కారమవుతుంటాయి. ఈ నిశబ్ద విప్లవకారుల కృషి వల్లే ప్రపంచం నేడు మూడో ప్రపంచ యుద్ధం వైపు వెళ్లకుండా సురక్షితంగా ఉందని చెప్పవచ్చు. వీరి అంకితభావం, నిబద్ధత ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. అంతర్జాతీయ ప్రతినిధుల దినోత్సవం అనేది దౌత్యం యొక్క గొప్పతనాన్ని చాటిచెప్పే రోజు. తుపాకులతో సాధించలేని విజయాన్ని మాటలతో, చర్చలతో సాధించవచ్చని ఈ రోజు మనకు గుర్తుచేస్తుంది. ప్రపంచ శాంతికి పునాది వేసిన శాన్ ఫ్రాన్సిస్కో సదస్సు ప్రతినిధులకు నివాళులర్పిస్తూ, ప్రస్తుత ప్రతినిధుల సేవలను కొనియాడదాం. దేశాల మధ్య సరిహద్దులు ఉన్నా, సమస్యలు ఎదురైనా, మానవత్వం అనే సూత్రంతో అందరం ఒకటి కావాలనే సందేశాన్ని ఈ దినోత్సవం ఇస్తుంది. 'వసుధైక కుటుంబం' అనే భావనను నిజం చేస్తూ ప్రపంచ దేశాలన్నీ శాంతి, సౌభ్రాతృత్వంతో వర్ధిల్లాలని ఆకాంక్షిద్దాం. ప్రతినిధులందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతూ, వారి కృషి విజయవంతం కావాలని కోరుకుందాం. శాంతియుత ప్రపంచ స్థాపనలో మనం కూడా భాగస్వాములం అవుదాం.

## శక్తి యాప్‌తో ప్రాణాపాయం నుంచి యువతి రక్షణ

- ఆటో డ్రైవర్ వేధింపుల నుంచి తప్పించుకున్న యువతి
- ఎమర్జెన్సీ బటన్‌తో నిమిషాల్లో స్పందించిన పోలీసులు
- మంగళగిరి వద్ద ఘటన -- నిందితుడి అరెస్ట్




**మంగళగిరి, ఏప్రిల్ 24 (ప్రతినిధి):** ఆపదలో ఉన్న ఓ యువతి స్మార్ట్‌ఫోన్‌ను ఆయుధంగా మార్చుకుని పోలీసుల సహాయంతో ప్రాణాపాయం నుంచి బయటపడిన ఘటన మంగళగిరి సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు అందుబాటులోకి తెచ్చిన 'శక్తి' యాప్ సాయంతో ఆమెను సురక్షితంగా రక్షించారు.

పోలీసుల కథనం ప్రకారం బెంగళూరు నుంచి వచ్చిన యువతి గురువారం రాత్రి విజయవాడకు చేరుకుని, అక్కడి నుంచి గమ్యస్థానానికి వెళ్లేందుకు ఆటో ఎక్కింది. ప్రారంభంలో సాధారణంగా ప్రవర్తించిన డ్రైవర్, నిర్మానుష్య ప్రాంతానికి చేరుకున్న తర్వాత అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు పాల్పడ్డాడు. రాత్రి సమయం కావడంతో యువతి తీవ్ర భయాందోళనకు గురైంది.ఈ పరిస్థితిలో ధైర్యం కోల్పోకుండా వెంటనే తన మొబైల్‌లో 'శక్తి' యాప్‌ను డౌన్‌లోడ్ చేసి రిజిస్టర్ చేసుకుంది. ఎమర్జెన్సీ బటన్ నొక్కగానే సమాచారం మంగళగిరి రూరల్ పోలీసులకు చేరింది. వెంటనే యువతి లోకేషన్‌ను ట్రాక్ చేసిన ఎస్సై వెంకట్ తన సిబ్బందితో కలిసి క్షణాల్లో స్పందించారు. చిన్న కాకాని సమీపంలో ఆటో నిలిపి యువతిని వేధిస్తున్న సమయంలో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పోలీసులను చూసి నిందితుడు ఆటోతో పారిపోవడానికి ప్రయత్నించగా, పోలీసులు వెంటాడి అతన్ని అదుపులోకి తీసుకున్నారు.తదుపరి యువతిని సురక్షితంగా ఆమె ఇంటికి చేర్చారు. ఈ ఘటనలో శక్తి యాప్ ప్రాముఖ్యత మరోసారి వెలుగులోకి వచ్చింది. ఆపద సమయంలో సాంకేతికత ఎంత కీలకంగా పనిచేస్తుందో ఈ ఉదంతం నిరూపించింది. పోలీసులు మహిళలు తప్పనిసరిగా 'శక్తి' యాప్‌ను తమ మొబైల్‌లో ఉంచుకోవాలని సూచిస్తున్నారు. అపరిచితులపై అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## తప్పుడు ప్రచారాలపై లోకేష్ ఆగ్రహం

- వీడియోలు వక్రీకరిస్తే కఠిన చర్యలు
- ఎడిట్ చేసిన వీడియోలపై హెచ్చరిక
- సీఎం హామీపై తప్పుడు ప్రచారం
- ఆటో డ్రైవర్‌కు బ్యాటరీ ఆటో
- నిందితులపై చట్టపరమైన చర్యలు తప్పవు



**అమరావతి, ఏప్రిల్ 24:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని వక్రీకరించి సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై మంత్రి నారా లోకేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వీడియోలను కావాలనే మార్పులు చేసి దుష్ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రతిపక్ష పార్టీ ఎన్నిసార్లు చెప్పినా తన తప్పుడు ప్రచారాల అలవాటును మార్చుకోవడం లేదని ఆయన విమర్శించారు. ఇటువంటి చర్యలు ప్రజలను తప్పుదోవ పట్టించడమే కాకుండా ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేలా ఉన్నాయని ఆయన మండిపడ్డారు. తిరుపతి జిల్లా నాయుడుపేటలో గత నెలలో జరిగిన టిడ్కో ఇళ్ల గృహప్రవేశాల కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒక లబ్ధిదారురాలి ఇంటికి వెళ్లి అక్కడి విశేషాలను తెలుసుకున్నారు. ఆమె భర్త ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడని తెలుసుకున్న ముఖ్యమంత్రి అతనికి జీవనోపాధి కోసం ఒక కొత్త బ్యాటరీ ఆటోను ఇప్పించాలని అక్కడికక్కడే జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. పేద కుటుంబాలకు అండగా ఉండాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి ఈ నిర్ణయం తీసుకున్నారని మంత్రి వివరించారు.ముఖ్యమంత్రి ఆ ఇంటి నుండి బయటకు వస్తుండగా ఎదురుగా ఉన్న మరో ఇంటి వద్ద ఒక మహిళ తన చదువుకున్న కుమారుడికి ఉద్యోగం ఇప్పించాలని కోరారు. అయితే కొందరు రాజకీయ దురుద్దేశంతో ఈ రెండు వేర్వేరు సంఘటనలను కలిపి వీడియోలను వక్రీకరించారు. చదువుకున్న యువకుడికి ఆటో కొనిపెడతారట అంటూ అపహాస్యం చేస్తూ సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం మొదలుపెట్టారని లోకేష్ తెలిపారు. వాస్తవాలను కప్పిపుచ్చి ప్రజలలో అయోమయం సృష్టించేందుకు ఇటువంటి కుట్రలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.గతంలోనే ఈ అంశంపై ప్రభుత్వ వాస్తవ పరిశీలన విభాగం ద్వారా స్పష్టమైన వివరణ ఇచ్చామని మంత్రి గుర్తు చేశారు. అయినా మళ్లీ అదే పాత అంశాన్ని తెరపైకి తెచ్చి దుష్ప్రచారం చేయడం దురుద్దేశపూర్వకమని ఆయన అన్నారు. ఒక మంచి పనిని వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందాలని చూడటం అత్యంత హేయమైన చర్య అని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఇటువంటి తప్పుడు వార్తలను నమ్మవద్దని అసలు నిజాలను గ్రహించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.వీడియోలను తప్పుడు అర్థం వచ్చేలా మార్పులు చేసి ప్రచారం చేయడం చట్టరీత్యా నేరమని లోకేష్ స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సాంకేతికతను వాడుకుని అబద్ధాలను ప్రచారం చేసే వారిని గుర్తించి శిక్షిస్తామని ఆయన తెలిపారు. ప్రభుత్వ పథకాలు కార్యక్రమాలపై అసత్య ప్రచారాలు చేసే వారిపై నిఘా ఉంచామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు.

# సైబరాబాద్ కమిషనర్ ఫీల్డ్ తనిఖీలు





- బస్తీల అభివృద్ధి, శుభ్రతపై దృష్టి
- కవూరి హిల్స్, కాకతీయ హిల్స్‌లో సమగ్ర పరిశీలన
- పార్కులు, వ్యర్థ నిర్వహణపై ఆదేశాలు
- ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యం

**సైబరాబాద్, ఏప్రిల్ 24** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కవూరి హిల్స్, కాకతీయ హిల్స్ ప్రాంతాల్లో విస్తృత స్థాయిలో ఫీల్డ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌లతో కలిసి పలు ప్రాంతాలను పరిశీలించారు. తనిఖీల సందర్భంగా నివాసుల సంఘాలు, ఉదయం నడకకు వచ్చే ప్రజలు, స్థానికులతో కమిషనర్ ప్రత్యక్షంగా మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరించారు. నగర పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఈ చర్యలు ఉపయోగపడతాయని అధికారులు పేర్కొన్నారు. కవూరి హిల్స్ పార్క్‌లో ఉన్న సదుపాయాలను పరిశీలించిన కమిషనర్, యోగా కేంద్రం సహా ఇతర సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు. అలాగే కాకతీయ హిల్స్‌లో నిర్వహిస్తున్న శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలిస్తూ నివాసుల సంఘాలతో కలిసి అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు.

కాకతీయ హిల్స్ పార్క్-1 వద్ద (రోడ్ నెంబర్ 4) షటిల్, పికిల్‌బాల్ కోర్టుల అభివృద్ధికి సూచనలు ఇచ్చారు. రెండు ప్రాంతాల్లోనూ శుభ్రత కార్యక్రమాలు క్రమం తప్పకుండా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. రోడ్ నెంబర్ 3 వద్ద నీటి నిల్వ సమస్యలను పరిశీలించిన కమిషనర్, అలాగే రోడ్ నెంబర్ 4, 6 కూడళ్ల వద్ద పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. రోడ్ నెంబర్ 6 నుంచి 11 వరకు ఉన్న ప్రాంతంలో నిర్మాణ వ్యర్థాలను వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. రోడ్ల వెడల్పు తగ్గించే అక్రమ నిర్మాణాలను తొలగించడంపై కూడా కమిషనర్ దృష్టి సారించారు. వీధి వ్యాపారులు "వ్యాపారం లేదు -- చెత్త బుట్ట లేదు" నిబంధనను పాటిస్తున్నారో లేదో సమీక్షించారు. మొత్తానికి, స్థల స్థాయిలో అమలు బలోపేతం, ప్రజా సౌకర్యాల మెరుగుదల, సమర్థవంతమైన నగర పాలనపై ప్రత్యేక దృష్టి పెట్టిన ఈ తనిఖీలు నగర అభివృద్ధికి దోహదపడనున్నాయి.